

15 తరువాతే..!



- ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపు ఆలస్యం
- సకాలంలో చెల్లించలేకపోతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ల చెల్లింపులు నెల నెలకూ ఆలస్యం అవుతూనే ఉన్నాయి. ఈ నెలలో 15 తరువాతే చెల్లింపులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం సకాలంలో వేతనాలు, పెన్షన్లను చెల్లించలేకపోవడంపై ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీతాల కోసం, పెన్షనర్లు పెన్షన్ల కోసం ప్రతి నెలా ఎదురు చూడాల్సి వస్తోంది. సకాలంలో అవి అందక, ఇఎంఐలు చెల్లించలేక, ఇతర అవసరాలు తీర్చుకోలేక అల్లాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 45 వేల మంది ఉద్యోగులు, 15 వేల మంది ఉపాధ్యాయులు, 5 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. గత నెల 10వ తేదీ తరువాత వేతనాలు, పెన్షన్లను ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుతానికి ప్రతిరోజూ కొందరికి జీతాలను చెల్లిస్తున్నారు. అందరికీ చెల్లింపులు పూర్తయ్యేసరికి ఈ నెల 15వ తేదీ దాటుతుందనేది అంచనా. సాధారణంగా వేస్ అండ్ మీన్స్, ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం, ఓవర్ డ్రాఫ్ట్ సౌలభ్యం పేరిట రాష్ట్రం అప్పుల వెసులుబాటు వినియోగించుకుంటూ ఉంటుంది. ఓవర్ డ్రాఫ్ట్ పేరుతో వినియోగించుకోదగ్గ మొత్తమూ అంతంతే. పైగా నిర్దిష్ట గడువులోగా వాటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అందులోనూ ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రంలో ఇంకా రూ.2,900 కోట్లు పింఛన్లు, జీతాలు కలిపి చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో రుణం తీసుకోవాలంటే దానికీ పరిమితులు ఉన్నాయి. ఇప్పటికే ఎపి తన పరిమితిని దాటేసింది. అంటే ఈ నెల అప్పు కూడా పుట్టదు. మరో వైపు కార్పొరేషన్ల నుంచి రుణం తీసుకునే అవకాశమూ లేదు. ఈ నెల ప్రారంభంలో రూ.2,000 కోట్లను ఏదో కార్పొరేషన్ పేరిట బ్యాంకుల నుంచి అప్పు తీసుకుని, రాష్ట్ర అవస రాల కోసం సర్దుబాటు చేసేశారు. ఇప్పటికే మద్యం సొమ్ముల పేరుతో రూ.8,300 కోట్లు, ఇతరత్రా కార్పొరేషన్ల పేరుతో మరో రూ.12,000 కోట్ల రుణాలు ప్రభుత్వం వినియోగించుకున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఇతరత్రా అవసరాలు పోను రోజువారీ రాబడిలో ఎంత మొత్తం జీతాలకు, పింఛన్లకు చెల్లిస్తారనే అంశంపైనే నవంబరు జీతాలన్నీ ఎప్పటికి చెల్లించగలరో తేలనుంది. గత నెల 10వ తేదీ పైన వేతనాలు పడటం, ఈ నెల 15 తరువాత అంటుండటంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

రెసిడెన్షియల్ పాఠశాలలో
అడిషనల్ డైరెక్టర్ తనిఖీలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక ఉర్దూ రెసిడెన్షియల్ మరియు పంచలింగాలలోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో రెసిడెన్షియల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ నరసింహారావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. ఆయన వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట రంగారెడ్డి కూడా ఉన్నారు.


రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న నరసింహారావు, డిఇఒ

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి కావాలి

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ త్వరగా పూర్తి కావాలని ప్రత్యేక పరిశీలకులు, అడిషనల్ డైరెక్టర్ నరసింహారావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి ఆయన ఉపాధ్యాయుల సర్దుబాటుపై సమీక్షించారు. విద్యాశాఖ జారీ చేసిన నిబంధనలు ప్రకారం ఈ ప్రక్రియ కొనసాగాలని పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ సామ్యూల్ పాల్ పలు వివరాలను ఆయనకు తెలిపారు.

సచివాలయాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలంలోని గార్గేయపురం, ఓర్వకల్ మండలంలోని పూడిచెర్ల గ్రామాల్లోని సచివాలయాల్లో కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ప్రజలకు అందుతున్న సేవలపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పూడి చెర్ల గ్రామ సమీపంలో ఉన్న జగనన్న కాలనీ హౌసింగ్ లేవుట్లను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ లు శివప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ వెంకటేష్ నాయక్, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

క్రీడాకారుల ఎదుగుదలకు
నిరంతరం పోటీలు

- క్రీడా ప్రాధికార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

రాష్ట్రంలో క్రీడాకారుల ఎదుగుదలకు తోడ్పాటు ఇచ్చేందుకు రాష్ట్ర క్రీడా శాఖ ఆధ్వర్యంలో నిరంతరం పోటీలను నిర్వహిస్తామని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నక్కల ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం సిఎం జగన్ పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన జోనల్ క్రికెట్ పోటీలను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభ నైపుణ్యాలను వెలికి తీసి వారి జాబితాను క్రీడా శాఖ ద్వారా భద్రం చేసేందుకు శాప్‌లీగ్ యాప్‌తో పాటు స్పోర్ట్స్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి క్రీడాకారుడు, క్రీడా సంఘాలు, క్రీడా అకాడమీల విద్యార్థులు అందరూ కూడా ఈ యాప్‌లో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. క్రీడాకారుల భవిష్యత్తు కోసం క్రీడాశాఖ రానున్న రోజుల్లో అనేక సంస్కరణలు తీసుకొస్తుందని అన్నారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు జిల్లా వాసిగా ఉమ్మడి కర్నూలు స్టేడియాల నిర్మాణానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నానని త్వరలోనే వాటికి కార్యాచరణ వస్తుందన్నారు. గ్రామ వార్డు సచివాలయాలలో సుమారు 2500 మంది స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు సంపాదించారని అన్నారు. జిల్లా క్రీడా శాఖ సిఇఒ రమణ, కర్నూలు , నంద్యాల ప్రధాన శిక్షకులు నటరాజరావు, ఎమ్ ఎన్వీరాజు, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, శాప్ కర్నూలు జిల్లా కోఆర్డినేటర్ శ్రీనాథ్, రాయలసీమ క్రిస్టియన్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఆదిమూలపు సతీష్, క్రీడా సంస్థ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాప్ చైర్మన్ సిద్ధార్థ రెడ్డి

క్రీడా మైదానాల
ప్రయివేటీకరణను రద్దు చేయాలి

- శాప్ చైర్మన్‌కు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి- కర్నూలు స్పోర్ట్స్

క్రీడాకారులకు, కోచ్‌లకు శాపంగా మారిన క్రీడా మైదానాల ప్రయివేటీకరణను ఆపి, పేఅండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో జగనన్న శాప్‌లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడానికి బుధవారం కర్నూలుకు వచ్చిన శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డికి, వైస్ చైర్మన్ అండ్ ఎండిఎన్.ప్రభాకర్ రెడ్డికి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా వినతిపత్రం అందజేశారు. క్రీడా మైదానాలను, స్టేడియాలను, ఇండోర్ స్టేడియాలను స్విమ్మింగ్ పూల్స్‌ను, జిమ్ కేంద్రాలను, యోగ సెంటర్లను ప్రైవేటీకరణ చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని కోరారు. పేద, మధ్యతరగతి క్రీడాకారులకు సదుపాయాలు కల్పించడంలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్థ శాప్ విఫలమవుతుందని వారి దృష్టికి తీసుకువెళ్లారు. క్రీడాకారులుకు పే అండ్ ప్లే విధానం తెచ్చిన తర్వాత రూ.3 వేల సభ్యత్వం ప్రతినెల రూ.1500 చెల్లించి ఆటలు నేర్చుకోవాల్సిన పరిస్థితికి క్రీడాకారులను నెట్టి వేశారన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా పేద మధ్యతరగతి కుటుంబాల నుంచి మంచి ప్రతిభ కనపరిచిన క్రీడల్లో మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులు క్రీడలకు దూరంగా మారు తున్నారన్నారు. కోచ్‌లకు కూడా ఎండి ప్రభాకర్ రెడ్డి వచ్చిన తర్వాత క్రీడాకారుల నుంచి డబ్బులు వసూల చేసిన వారిని కోచ్‌లుగా కొనసాగిస్తామని, లేకుంటే లేదనే టార్చర్ విపరీతంగా పెడుతున్నారని, దీనివల్ల కోచ్‌లు కూడా మానసికంగా ఇబ్బందులకి గురై క్రీడాకారులకు కోచింగ్ ఇవ్వడంలో సరైన ధ్యాస పెట్టలేక పోతున్నారని తెలిపారు. చైర్మన్ ఎండి క్రీడాకారులని ప్రోత్సహిస్తున్నామని పదేపదే చెప్పడంలో పసలేదన్నారు. గత మూడు సంవత్సరాల నుండి వైఎస్ఆర్ క్రీడా ప్రోత్సాహక బహుమతులు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తక్షణమే పెండింగులో ఉన్న క్రీడా ప్రోత్సాహక బహుమతులను అందజేయాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్ బాషా, నాయకులు మధు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, నగర అధ్యక్షులు అమర్ నాయకులు అంజి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీసీల సంక్షేమానికి తూట్లు

- టిడిపి నేత గౌరు వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలోని వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం బిసిల సంక్షేమానికి తూట్లు పొడిచిందని టిడిపి నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట టిడిపి బిసి సెల్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం సమీపంలో ధర్నా నిర్వహించారు. గౌరు వెంకట రెడ్డి మాట్లాడుతూ బిసిల ద్రోహి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. బిసిలను బానిసలుగా మార్చిన జగన్ మోహన్ రెడ్డి ఖాళీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బిసిల కడుపు కొట్టారన్నారు. గత ప్రభుత్వాలు స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వాటిని 27 శాతానికి తగ్గించిందన్నారు. బిసిల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. అనంతరం డిఆర్ఒ మల్లికార్జునుడుకు టిడిపి బిసి సెల్ నేతలు వినతిపత్రం అందజేశారు. బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, కాసాని మహేష్ గౌడ్, గంగాధర్ గౌడ్, కేతురు మధు, బివిఎన్.రాజు యాదవ్, కాకరవాడ చిన్న వెంకట స్వామి, ధనుంజయ, మాదేష్, వెంకటేష్ పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న గౌరు వెంకట్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జిఎంపిఎస్ ప్రధాన కార్యదర్శి గోవిందు

మూడోవారంలో జిఎంపిఎస్ కలెక్టరేట్ ఎదుట ధర్నా


ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

గొర్రెల మేకల పెంపకం దారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ మూడో వారంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి గొర్రెల మేకల పెంచకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు తెలిపారు. జీవాల నష్టపరిహారం, ఎన్‌సిడిసి రుణాలు, మేత, నీరు, వైద్యం తదితర సమస్యలతో గొర్రెల మేకల పెంపకం దారులు సతమత మవుతున్నారని పేర్కొన్నారు. బుధవారం కర్నూలు కార్మికకర్షక భవన్‌లో జిఎంపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు మల్లేష్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. గోవిందు మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రమాదాలకు గురై జీవాలు చని చనిపోయి గొర్రెలపెంపకం దారులకు తీవ్ర నష్టం కలిగినా ప్రభుత్వం ఇంతవరకు చనిపోయిన గొర్రెలకు నష్ట పరిహారం అందించలేదని అన్నారు. అంతే కాకుండా జీవాలకు పచ్చిక బైళ్ళు (జీవాలు మేపుకోవడానికి స్థలాలు) లేకపోవడంతో గొర్రెల పెంపకం దారులు పొలాల యజమానులతో తీవ్ర అవమానాలకు గురవుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గొర్రెల సొసైటీలకు ఆర్థిక పరిపుష్టి కలిగించడానికి ప్రభుత్వం ఎన్‌సిడిపి రుణాలు మంజూరు చేస్తే ప్రస్తుతం ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. దీనివల్ల గొర్రెలసొసైటీలు పూర్తిగా నష్టపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మూడో వారంలో ధర్నాకు జిల్లాలోని సొసైటీ సభ్యులందరూ , గొర్రెల పెంపకం దారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిఎంపిఎస్ జిల్లా అధ్యక్షులు రాముడు జిఎంపిఎస్ జిల్లా నాయకులు ఆంజనేయులు, మద్దిలేటి, ఎల్లరాజు, చంద్రయ్య, మస్తాన్, లింగమయ్య పాల్గొన్నారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-పత్తికొండ :

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పత్తి కొండ అర్బన్ సిఐ మురళీ మోహన్ సూచించారు. పత్తి కొండ ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సిఐ మురళీమోహన్ మాట్లాడుతూ గుట్కా, పేకాట, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. యువత మంచి అలవాట్లతో ఉన్నత లక్ష్యాల వైపు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మాధురి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐ మురళి మోహన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. బుధవారం రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 37 వ వార్డు 96 వ సచివాలయం వీకర్ సెక్షన్ కాలనీలో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు . ఎమ్మెల్యే కాలనీలోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డ్ కార్పొరేటర్ అయేషా సిద్ధిఖా, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, దండు లక్ష్మీకాంత్ రెడ్డి, ఎ.నాగ లక్ష్మీరెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, కల్లూరు మండల జడ్‌పిటిసి ఆల ప్రభాకర్ రెడ్డి, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతు రెడ్డి, నంద్యాల పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సిసెల్ శివ సందేపోగు, దిశ కమిటీ మెంబర్ ఎరుకల రాజు, నాయకులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గ్రామాల్లో ఉపాధికి భరోసా కల్పించాలి

ప్రజాశక్తి-పత్తికొండ

: గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీకి భరోసా కల్పిస్తూ ప్రభుత్వం నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరశేఖర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహా సభలు ఈనెల 8 నుండి 10వ తేదీ వరకు జంగారెడ్డిగూడెం లో జరుగుతున్న నేపథ్యంలో సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పత్తికొండ మండల కేంద్రంలో ఈశ్వర్‌రెడ్డి భవన్ దగ్గర సంఘం జండాను వీరశేఖర్ ఆవిష్కరణ చేశారు. స్థానిక మండల నాయకులు బుజ్జులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీరశేఖర్ , మండల కార్యదర్శి పెద్దహుల్తి సురేంద్ర మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకు ఉపాధి కరువవుతుందని, దశా బ్దాలుగా పోరాడి సాధించుకున్న గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నీరుగార్చే కార్యక్రమం చేపట్టిందన్నారు. సంఘం నాయకులు శికామణి, నరసన్న, వినోద్ ఈశ్వరయ్య, నడిపి రంగన్న పాల్గొన్నారు.


జెండాను ఎగురవేస్తున్న వీరశేఖర్

నేడు జెఎసి చైర్మన్ బొప్పరాజు రాక

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఎపి ఉద్యోగ అమరావతి జెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు గురువారం కర్నూలుకు రానున్నారు. కలెక్టరేట్‌లోని రెవిన్యూ పొదుపు భవన్లో జరిగే రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం , ఎపి అమరావతి జెఎసి జిల్లా కార్యవర్గ సమావేశాల్లో ఆయన పాల్గొంటారని అమరావతి జెఎసి జిల్లా చైర్మన్ గిరి కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



బిసి సభలో ముఖ్యమంత్రిని మర్యాపూర్వకంగా కలిసిన ఎంపీ సంజీవ్‌కుమార్

బిసి గర్జనలో పాల్గొన్న ఎంపీ సంజీవ్ కుమార్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

విజయవాడ లో నిర్వహించిన బిసి గర్జన మహాసభలో కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

మంత్రి పెద్దిరెడ్డిని భర్తరఫ్ చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పుంగనూరులో రామచంద్ర యాదవ్‌పై దాడికి పాల్పడిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలని యాదవ సంఘాలు డిమాండ్ చేశాయి. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పుంగనూరులో రామచంద్ర యాదవ్‌పై దాడిని నిరసిస్తూ యాదవ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. యాదవ సంఘం నాయకులు పిజి నరసింహులు యాదవ్, అయ్యన్న యాదవ్, శేషఫణి యాదవ్‌లు మాట్లాడుతూ బిసి పైన దాడులు చేస్తూ బిసి గర్జనలు పేరుతో బిసిలకు న్యాయం చేస్తున్నామంటూ చెప్పుకోవడం వైఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా బీసీలకు మేలు చేసిన వారు కావాలంటే ఇటువంటి దాడులకు పాల్పడకుండా దాడులకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి మహిళా సంఘం నాయకులు రాజేశ్వరి, మహేష్ నాయుడు, ప్రభాకర్ యాదవ్, తిక్కన్న యాదవ్, నాగజ్యోతి, యాదవ్, శ్రీరామ్ యాదవ్, గజేంద్ర యాదవ్ సింధు నాగేశ్వరరావు యాదవ్, రాధాబాయి పాల్గొన్నారు.

సూర్య దేవాలయంలో దత్త జయంతి వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సూర్య దేవాలయంలో దత్త జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తైలాభిషేకాలు, దత్త హోమాలు అదేవిధంగా కృత్తికా నక్షత్రం సందర్భంగా కావడి సేవలు అభిషేకాలు, సుబ్రహ్మణ్య హోమాలు నిర్వహించారు. భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని తైలాభిషేకాలు, కావడి సేవలు, దత్త సుబ్రహ్మణ్య హోమాలు చేశారు. అనంతరం అన్నదాన సేవా వితరణలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు.



సాయిధ దళాల నిధికి విరాళాల సేకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాయుధ నిధి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి తమ వంతు బాధ్యతగా జిల్లా కలెక్టర్ విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయ సూపరింటెండెంట్ మహేంద్రమ్మ, సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.


విరాళం ఇస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

పోతుల నాగరాజును గెలిపించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్: కర్నూలు నగరం లోని, బండి మెట్ట మూడవ వార్డు వీధులలో, ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సీనియర్ నాయకుడు డి.పార్వతయ్య, వార్డు కార్యదర్శి షేక్‌షా, రాజు, మరి కొంతమంది కలిసి పోతుల నాగరాజును గెలిపించాలని బుధవారం ప్రచారం నిర్వ హించారు. నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరు అయిన ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పి .నాగరాజు పిడిఎఫ్ మద్దతు, వామపక్ష, ప్రజా తంత్ర శక్తుల, విద్యార్థి,యువజన, సంఘాల మహిళ సంఘాల మద్దతుతో నిలబడిన పోతుల నాగరాజు ను గెలిపించాలని పట్టాభద్రులయిన ఓటర్లను కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక, విధా నాలకు వ్యతిరేకంగా, పోరాడుతూ, ప్రజా సమస్యల పరి ష్కారం కోసం, పని చేస్తున్న పోతుల. నాగరాజును గెలిపించాలని పట్ట భద్రులను కోరారు.




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాముడు

2022-2023 అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలో 2022-2023 కు గాను పంచాయతీలలో అభివద్ధి ప్రణాళికలపై ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి సందీప్, కో ఆర్డినేటర్లు సునీలా, అభిషేకంలు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. షెడ్యూల్ 11 లోని 29 అంశాలను పరిగణలోకి తీసుకోని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశాల దృష్ట్యా సర్పంచులు, అధికారులు కార్యాచరణ చేపట్టవలసి ఉంటుందని అన్నారు.

మానవ మనుగడకు చెట్లు కీలకం

- చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడండి - మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి


మొక్కలు నాటుతున్న కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మానవ మనుగడకు చెట్లు కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని హెచ్‌బిఎస్ కాలనీలోని పార్కులో 16వ సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో టేకు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చెట్లు అంతరించిపోతే పర్యావరణం దెబ్బతిని మానవాళి మనుగడ కష్టమవుతుందని తెలిపారు. అలాగే పట్టణంలో పార్కుల అభివృద్ధికి కషి చేస్తామన్నారు. డిఇ మనోహర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది విద్యావతి, విరుపాక్షి, మహానందయ్య, గోవిందు, సుభాష్, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలపై శిక్షణ

- జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సోమశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న సోమశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

జిల్లా పశ్చిమ ప్రాంతంలోని యువత వలసలు వెళ్లకుండా ఉపాధి పొందేందుకు జీవన నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని గ్రామీణ యువతకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సోమశేఖర్ రెడ్డి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధికారిని శ్యామల హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... నిరుద్యోగ యువత ఉపాధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని తెలిపారు. సాంప్రదాయ గ్రామీణ కళల్లో నైపుణ్యం ద్వారా చిన్న, మధ్య తరహా రుణాలను పొంది ఉపాధి పొందవచ్చని చెప్పారు. ఈ పథకాలను యువత వినియోగించుకొని రుణాలను పొంది వలసలు వెళ్లకుండా జీవనోపాధిని పెంపొందించుకోవాలని అన్నారు.

సమయానుగుణంగా విద్యార్థి బస్సు నడపాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల నుంచి వివిధ గ్రామాలకు పాఠశాల నిర్ణీత వేళల్లోనే విద్యార్థి బస్సును నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న, మండల అధ్యక్షులు ఖాజా డిమాండ్ చేశారు. బుధవారం గోనెగండ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలోని కులుమాల, హెచ్.కైరవాడి, చిన్నమర్రివీడు గ్రామాలకు విద్యార్థి బస్సు రోజూ సాయంత్రం ఆలస్యంగా వస్తోందని తెలిపారు. విద్యార్థులు సుమారు 2, 3 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తుందని చెప్పారు. సమస్యపై ఎమ్మిగనూరు డిపో మేనేజర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. అధికారులు స్పందించి సమయానుకూలంగా విద్యార్థి బస్సులు నడపాలని కోరారు. లేకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నంది కుమార్, సలీం, మురళీ, సురేష్, మంజునాథ్, చత్రపతి, చిరు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తెర్నేకల్, దేవనకొండ జిల్లా పరిషత్, రెయిన్‌బో హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రశాంతి, సుభాషిని, అల్లిపీరా తెలిపారు. బుధవారం వారు మాట్లాడారు. కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో ఈనెల 6న జిల్లాస్థాయిలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు తెర్నేకల్ హై స్కూల్ విద్యార్థులు బాబు, శివాజీ, ఉదయకుమార్, దేవనకొండ రెయిన్‌బో హైస్కూల్ విద్యార్థులు జావిద్, దస్తగిరి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థులను, ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు మద్దిలేటి, హుస్సేన్ బాషను ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు


హాకీకి ఎంపికైన తెర్నేల్ విద్యార్థులు

వేదవతి రిజర్వాయర్‌కు మోక్షమెన్నడు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించే వేదవతి రిజర్వాయర్ నిర్మాణానికి మోక్షమెప్పుడు వస్తుందోనని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ ప్రశ్నించారు. బుధవారం జ్యోతిబసు భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలో వేదవతి, నగరడోన రిజర్వాయర్ల పనులను ప్రారంభించారని, నెలలు గడవక ముందే



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ

నిధులు లేక ఆగిపోవడం ప్రభుత్వ, పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శమని విమర్శించారు. వేదవతి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని కోరారు. ఆలూరు ప్రాంత ప్రజలు, రైతులను ఆదుకునేందుకు త్వరగా రిజర్వాయర్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్, ఈరన్న, ఈశ్వర్ గౌడ్, నాగరాజు, మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణానికి తొలగిన అడ్డంకులు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో గ్రంథాలయ నూతన నిర్మాణానికి ఎట్టకేలకు అడ్డంకులు తొలగినట్లు గ్రంథాలయ అధికారి అబ్దుల్ రసూల్ తెలిపారు. బుధవారం రెవెన్యూ అధికారులు గ్రామ కంఠంలో చూపిన స్థలాన్ని పంచాయతీ తీర్మానంతో ఆమోదించిన పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ లక్ష్మీనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. చదువుకున్న యువతకు గ్రంథాలయంలో మంచి సందేశం ఇచ్చే పుస్తకాలు దొరుకుతాయని తెలిపారు. వాటి వల్ల ఎన్నో కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడానికి అవకాశం ఉందన్నారు. నిర్మాణం త్వరగా పూర్తి చేసేటట్లు కృషి చేయాలని గ్రంథాలయ అధికారికి సూచించారు.


పంచాయతీ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న అబ్దుల్ రసూల్

సౌత్ జోన్‌కు 'నారాయణ' విద్యార్థి


ఎంపికైన విద్యార్థితో కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు కోసిగిలోని నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థి ఈరన్న ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ హుస్సేనయ్య, ప్రిన్సిపల్ షేక్షావలీ తెలిపారు. బుధవారం వారు విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత వారంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన రాయలసీమ యూనివర్సిటీ అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో తమ కళాశాల డిగ్రీ మూడో సంవత్సరం విద్యార్థి ఈరన్న అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయినట్లు తెలిపారు. ఈనెల 7 నుంచి 11 వరకు బెంగళూరులో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. తమ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తూ ఉండడం హర్షణీయమన్నారు. భవిష్యత్‌లో క్రీడలకు మరింత ప్రోత్సహం అందిస్తామని తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బాలకృష్ణను అభినందించారు. డైరెక్టర్ చౌడయ్య, వైస్ ప్రిన్సిపల్ బాలాజీ, అధ్యాపకులు షేక్షావలీ పాల్గొన్నారు.

వాతావరణానికి అనుగుణంగా పంటల సాగు : రమేష్

మంత్రాలయం : వాతావరణానికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేసుకోవాలని రిలయన్స్ సంస్థ, ఆర్డిప్ మండల కోఆర్డినేటర్ రమేష్ సూచించారు. బుధవారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డిప్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు అధిక దిగుబడి సాధించేందుకు మోతాదుకు మించి రసాయనిక మందులు వాడి పంటలు నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అప్పుల ఊబిలో కూరుకుని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. రిలయన్స్ సంస్థ ప్రోగ్రాం ఫెసిలిటేటర్ భీమేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

'ఒక్క ఛాన్స్'తో మోసం చేసిన జగన్

- టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

ప్రజాశక్తి - ఆస్పరి


ఆస్పరిలో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

'ఒక్కఛాన్స్' అంటూ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ విమర్శించారు. బుధవారం 'ఇదేం కర్మ...మన రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా మండలంలోని శంకరబండ, చిరుమాన్ దొడ్డి, హాలిగేర గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ పరమారెడ్డి ఆధ్వర్యంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అత్యంత వెనుకబడిన పశ్చిమ ప్రాంతం ఆలూరు నియోజకవర్గానికి తాగు, సాగునీరు అందించకుండా రైతులను మోసం చేశారని విమర్శించారు. వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టును 8 టిఎంసిలతో నిర్మిస్తే ఆలూరు తాలూకాకు నీటి కొరత ఉండదన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తాలూకా అభివృద్ధిని మరచి కుటుంబం మొత్తం 200 ఎకరాలు అక్రమంగా రైతుల భూములను కొనుగోలు చేశారని తెలిపారు. సొసైటీ మాజీ ఛైర్మన్ నౌనేపాటి, డైరెక్టర్ కృష్ణ, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ సాలిసాహెబ్, మండల మాజీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, ఎంపిటిసిలు నరసప్ప, రహీంతుల్లా, నాయకులు తిమ్మన్న, రాజ్‌కుమార్, సోమలింగ, ముత్యాల రెడ్డి, ఉచ్చీరప్ప, సుదర్శన్, సతీష్, యుగంధర్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని కాంతి నగర్ 25వ వార్డులో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి క్లస్టర్ యూనిట్ సభ్యులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూపాల్ చౌదరి మాట్లాడారు. 'ఒక్క ఛాన్స్' జపంతో అధికారంలోకి వచ్చిన వైసిపి నాయకులు దోచుకోవడం.. దాచుకోవడమే నైజంగా ఉన్నారని విమర్శించారు. నిరుద్యోగ, నిత్యావసర ధరలు, మద్యపానం, కుంటుపడిన అభివృద్ధి, తాగునీరు, విద్యుత్, రోడ్లు తదితర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. నాయకులు కె.ఈరన్న, నాగేందర్ రెడ్డి, శాంతి, కోట ఈరన్న, జయరాం, చిట్టిబాబు, ఉలగయ్య, డికె.జగదీష్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 1వ వార్డులో వార్డు ఇన్‌ఛార్జీ వెంకటేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. నాయకులు బుద్దారెడ్డి, మాజీ కౌన్సిలర్ అంజి, కాశీ ఉన్నారు. అంబేద్కర్ నగర్‌లో టిడిపి సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. **గోనెగండ్ల**లోని 233, 234 బూత్‌ల పరిధిలోకి వచ్చే వీధుల్లో టిడిపి నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగారు. టిడిపి నాయకులు బేతాళ బడేసాబ్, శ్రీధర్ నాయుడు, ఎన్‌వి.రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, రంగస్వామి నాయుడు, రమేష్ నాయుడు, రజ్జప్, గౌవుండా రహమతుల్లా పాల్గొన్నారు.


ఆదోనిలో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న భూపాల్ చౌదరి


గోనెగండ్లలో...

'ఇదేం ఖర్మ'ను జయప్రదం చేయండి

- టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి



ప్రజాశక్తి - నందవరం

నేటి నుంచి ఐదురోజుల పాటు నందవరంలో 'ఇదేం కర్మ... మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపేందుకు 'ఇదేం కర్మ... మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి పర్యటిస్తారని చెప్పారు. రోజుకు మూడు వార్డుల చొప్పున ఐదు రోజుల పాటు వాడవాడలో తిరిగి ప్రజా సమస్యలపై ఆరా తీయనున్నట్లు తెలిపారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

హక్కుల కోసం ఐక్య ఉద్యమం

- ఆర్‌సిసి నాయకులు శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

రాయలసీమకే తలమానికంగా ఉన్న కళారూపాలు, వాటిని పోషిస్తున్న కళాకారులను రక్షించుకోవడం కోసం ఐక్యంగా పోరాటం చేయాలని రాయలసీమ కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాష్, సుధాకర్ కోరారు. బుధవారం దేవనకొండ తహశీల్దార్ కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మూగితాత కల్యాణ మండపంలో రాయలసీమ కళావేదిక ఆధ్వర్యంలో 'కళాకారుల స్థితిగతులు–మన కరవ్యం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వార మాట్లాడారు. మండలవ్యాప్తంగా సుమారు 6 వేల మంది కళాకారులు ఉన్నారని తెలిపారు. వారికి ఇప్పటివరకు గుర్తింపు కార్డులు లేవని, ఇళ్ల స్థలాలు కూడా కేటాయించలేదని చెప్పారు. కళాకారుల పింఛను కూడా అందడం లేదన్నారు. ఇదంతా కళాకారుల హక్కులను హరించడమేనని తెలిపారు. ప్రభుత్వం కళాకారుల ఇళ్ల స్థలాల కోసం దేవనకొండలో ఐదెకరాల్లో కళాకారుల కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కళాకారులు వివిధ నాటకాల్లోని అంకాలను ప్రదర్శించారు. రాయలసీమ కళావేదిక రాష్ట్ర నాయకులు మనిరత్న, శివానంద, రాంచరణ్, పురుషోత్తం పాల్గొన్నారు.


తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, కళాకారులు


అయ్యప్ప స్వాములను సన్మానిస్తున్న నవాజ్

మత సామరస్యానికి మారుపేరు ఎమ్మిగనూరు

- టిడిపి పట్టణ కార్యదర్శి నవాజ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మత సామరస్యానికి మారుపేరు అని టిడిపి పట్టణ కార్యదర్శి నవాజ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి మాలలో ఉన్న భక్తులను నవాజ్ పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా నమాజ్ మాట్లాడారు. నియోజకవర్గంలో అందరూ కలిసికట్టుగా కుల, మతాలకు అతీతంగా సోదర భావంతో మెలగాలని తెలిపారు. నియోజవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి, తన తరపున అయ్యప్ప స్వామి ఆలయానికి బయల్దేరుతున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ఓటు నమోదు తప్పనిసరి

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ



ప్రజాశక్తి - చిప్పగిరి

ఓటు హక్కు అనేది అందరీ హక్కు అని, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాల ని తహశీల్దార్ లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం ఆయన తహశీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ 18 ఏళ్లు నిండిన యువత సచివాలయానికి వెళ్లి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. సచివాలయ అధికారులు, వాలంటీర్లు ఓటరు నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు కలిగి ఉండడం యువత బాధ్యత అని, అది తెలుసుకోవాలని అన్నారు. మార్పులు, చేర్పులుంటే కూడా అధికారులను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం వెసలుబాటు కల్పించిందని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ మధు స్వామి పాల్గొన్నారు.

అంజలి ఎంపిక గర్వకారణం

- 9న జరిగే టీ-20 మ్యాచ్‌లోనూ ప్రతిభ చాటుతుంది

- తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్

ప్రజాశక్తి - ఆదోని


సమావేశంలో మాట్లాడుతున్న విట్టా రమేష్

ఆదోని అమ్మాయి అంజలి శర్వాణి భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపిక కావడం రాష్ట్రానికే గర్వకారణమని ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విట్టా రమేష్, కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు ముజీబ్ అహ్మద్ కొనియాడారు. బుధవారం వారు పట్టణంలోని భీమాస్ కాన్ఫరెన్స్ హాలులో విలేకరులతో మాట్లాడారు. అంజలి శర్వాణికి చిన్నప్పటి నుంచి క్రీడలు అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. అథ్లెటిక్‌గా రాణిస్తూనే క్రికెట్ వైపు మొగ్గుచూపుతూ కష్టపడి అంచెలంచెలుగా ఎదిగారని చెప్పారు. అండర్-16, అండర్-19, అండర్-21, భారత 'ఎ' జట్టుకు ఎంపికై బంగ్లాదేశ్, శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌ల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. రైల్వే ఉద్యోగం చేస్తూనే శిక్షణ తీసుకుంటూ రైల్వే జట్టు తరపున ఆడుతూ భారత మహిళా సీనియర్ జట్టుకు ఎంపికై కావడం అభినందనీయమన్నారు. ఈనెల 9 నుంచి ముంబయిలో ఆస్ట్రేలియాతో జరిగే టీ–20 మ్యాచ్‌లోనూ ప్రతిభ కనబరుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వన్డే, టెస్ట్ మ్యాచ్‌లకు కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. భారత జట్టుకు మంచి విజయాలు అందించి దేశం గర్వించే క్రీడాకారిణిగా ఎదగాలన్నారు. త్వరలోనే ఆదోనిలో ఆమెకు ఘన స్వాగతంతో పాటు ప్రముఖులతో సన్మానం చేస్తామని తెలిపారు. ఎందరో మహిళా క్రీడాకారులకు ఆమె స్ఫూర్తి అన్నారు. అసోసియేషన్ సహాయ కార్యదర్శి కంబిరెడ్డి, కోచ్ బాలాజీ, జెఎమ్‌డి.బాష ఉన్నారు.


టిడిపి నాయకులతో ఉన్న సినీ దర్శకుడు

దేవర ఉత్సవాల్లో టిడిపి నాయకులు

- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద గ్రామంలో శ్రీమారికాంబ దేవి దేవర ఉత్సవాల్లో సినిమా దర్శకునితో పాటు టిడిపి నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు. బుధవారం టిడిపి మంత్రాలయం నియోజకవర్గం సీనియర్ నాయకులు ఉలిగయ్య, మండల నాయకులు సంజీవరెడ్డి, సినిమా దర్శకుడు మంజునాథ్‌కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, మండల నాయకులు కొట్రేష్ గౌడ్, కురుగోడు, నందమూరి బాలకృష్ణ ఫ్యాన్స్ నాయకులు నరసింహులు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలందరూ బాగుండాలని, రైతులకు పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. గ్రామస్తులు నాయకులకు స్వాగతం పలికి పూలమాలలతో సన్మానించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ బంధువులు రావడంతో ఉరుకుందలో పండగ వాతావరణం నెలకొంది. అంతకుముందే ప్రతి ఇంటి నుంచి మహిళలు కుంభాలు తీసుకెళ్లి గ్రామ దేవతకు పూజలు నిర్వహించారు.

వైభవంగా దత్త జయంతి వేడుకలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని నేలతలమర్రి గ్రామంలో బుధవారం దత్త జయంతి వేడుకలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా చిత్రపటాన్ని గ్రామ వీధుల గుండా ఊరేగించారు. దత్త జయంతి వేడుకల్లో భాగంగా షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మల్లికార్జున

మండలాభివృద్ధికి కృషి చేయాలి : ఎంపిడిఒ

హాలహర్వి : మండలాభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఎంపిడిఒ ఆంథోని తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండలాభివృద్ధిపై అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటు హక్కు అనేది భారత పౌరుని జన్మ హక్కు అని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత గ్రామంలో ఉన్న సచివాలయ కార్యాలయానికి వెళ్లి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది,

మహిళల అభ్యున్నతికి పాటుపడాలి

- టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'ఓ చెల్లి.. జర జాగ్రత్త'

ప్రజాశక్తి - ఆదోని

మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పాటుపడాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు కోరారు. బుధవారం పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'ఓ చెల్లి.. జర జాగ్రత్త' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు బోయ తేజ, బెస్త సూర్య, బల్లేకల్ సూర్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అతిథులుగా హాజరయిన మూడో పట్టణ సిఐ శ్రీరామ్, ఇస్వి ఎస్ఐ విజయ లక్ష్మి, మూడో పట్టణ ఎస్ఐ ముని ప్రతాప్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకులు అయ్యప్ప, నళిని, ఉమా దేవి మాట్లాడారు. సమాజంలో ప్రతి శాఖలోనూ మహిళలు, విద్యార్థినుల పట్ల దాడులు, వివక్షత చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్ నాయకులు సూర్య, కపటి గణేష్, రాజా రత్నం, అబ్దుల్, నూర్, మహేష్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కమిటీ సభ్యులు రవి కుమార్, గౌతం, వెంకటేష్, కుమార్, వీరేంద్ర, రామాంజి, షేక్షా, ప్రవీణ్, మహిళ కమిటీ నాయకులు ఫౌజీ, రామ లక్ష్మి, బుజ్జి, భవిత, మానస, దీప్తి, స్వప్న, శ్వేత పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

పిజి గ్రూపులను ఎత్తేయడం తగదు

- ఆర్ట్స్ కళాశాల ముందు డిఎస్ఎఫ్ నిరసన


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

పిజి గ్రూపులను రద్దు చేయడం ఆర్ట్స్ కళాశాల యాజమాన్యానికి తగదని విద్యార్థులు మండిపడ్డారు. బుధవారం డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (డిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ మాట్లాడారు. జిఒ 77 వల్ల ప్రయివేట్, ఎయిడెడ్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు రావని తెలిపారు. దీనిని సాకుగా చూపి ఆర్ట్స్ కళాశాలలో పిజి గ్రూపులు ఎత్తేయడం భావ్యం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి డిగ్రీ తర్వాత ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలని కోరారు. ప్రయివేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు కూడా ఉపకార వేతనాలు ఇవ్వాలని తెలిపారు. ప్రిన్సిపల్ మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ... సమస్యను కళాశాల మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిఎస్ఎఫ్ నాయకులు హరి, వంశీ, చిన్న, చిరు, సుమంత్, రవి, రాము, పవన్, గోపాల్, విద్యార్థులు ఉన్నారు.

'16 నుంచి రైతు రక్షణ కాలినడక పాదయాత్రలు'

ప్రజాశక్తి - దేవనకొండ

రైతుల భవిష్యత్తుకు పాలక ప్రభుత్వాలు చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరుతూ ఈనెల 16 నుంచి 20 వరకు చేపట్టే రైతు రక్షణ కాలినడక పాదయాత్రలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. బుధవారం సిపిఐ, ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.నెట్టేకల్లు ఆధ్వర్యంలో సిపిఐ మండల ప్రధాన కార్యదర్శి ఎం.నరసరావు, రైతు సంఘం మండల సీనియర్ నాయకులు వై.కండప్పలు కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. సిపిఐ మండల సీనియర్ నాయకులు ప్రసాద్, పట్టణ సహాయ కార్యదర్శులు రాజశేఖర్, కృష్ణ, ప్రజాసంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, మహేష్, వీరేష్, భాస్కర్, నాగేంద్ర, రంగస్వామి, కిష్టన్న, రంగయ్య, రాముడు, మాబాష, రైతులు పాల్గొన్నారు.

చెట్ల కింద వంటలు చేయించొద్దు

- 100 శాతం విద్యార్థుల హాజరు ఉండాలి
- 'మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయించండి
- పాఠశాలల విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో మధ్యాహ్న భోజన పథకాన్ని పగడ్బందీగా అమలయ్యేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పాఠశాలల విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ వెంకట కృష్ణా రెడ్డి ఆదేశించారు. జోనల్ పరిధిలోని ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులతో, పాఠశాలల హెచ్ఎంలతో జూమ్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం అమలు, మూత్రశాల పరిశుభ్రత, గుడ్లు, చిక్కిళ్ళు సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం అమలు తీరుపై విజిలెన్స్ కమిటీలు తనిఖీలు చేయడానికి వచ్చినప్పుడు అధికారులు, హెచ్ఎలు సహకరించాలని సూచించారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చెట్ల కింద చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనంలో 100 శాతం పిల్లల హాజరు ఉండాలని. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కోడిగుడ్లు నెలకు మూడుసార్లు కాకుండా నాలుగు సార్లు ఏజెన్సీలు వచ్చి ఇచ్చేలా చూడాలని. ఆ వచ్చిన గుడ్లు ప్రభుత్వం సూచించిన కోడ్ ప్రకారం ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సక్రమంగా మధ్యాహ్న భోజనం అమలయ్యేలా కృషి చేయాలన్నారు. పోర్టిఫైడ్ రైస్‌ను పక్కాగా ఉపయోగించాలన్నారు. పాఠశాలలో మూత్రశాలలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నంద్యాల జిల్లా నుండి డిఇఒ అనురాధ, డిప్యూటీ డిఇఒ బేగ్, ఎంఇఒలు, హెచ్ఎఒలు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 67 మూడు చక్రాల బైక్‌లు మంజూరు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాకు 67 మూడు చక్రాల బైక్‌లు మంజూరయినట్లు విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పి విజయ తెలిపారు. మూడు చక్రాల బైకు కోసం దరఖాస్తు చేసుకున్న వికలాంగుల అభ్యర్థులను బుధవారం కలెక్టరేట్ వైఎస్ఆర్ సెంటినరీ హాల్లో దాదాపు 167 మందికి కమిటీ సభ్యులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 67 మోటరైజుడ్ మూడు చక్రాల బైకులు మంజూరయ్యాయని, ప్రతి నియోజకవర్గానికి 10 చొప్పున అర్హులైన ఆర్థోపెడిక్ వికలాంగులకు అందజేస్తామన్నారు. దాదాపు 300 దరఖాస్తులు రాగా వివిధ కారణాలతో 224 తిరస్కరించినట్లు చెప్పారు. మిగిలిన 176 మంది సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి అందులో వారిని ఎంపిక కోసం ఆహ్వానించామన్నారు. కమిటీ ఆధ్వర్యంలో 67 మందిని ఎంపిక చేసి త్వరలోనే మూడు చక్రాల బైకులు అందజేస్తామన్నారు. నియోజకవర్గానికి 10 వచ్చిన బైక్లలో ఐదు మహిళల కోటా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడు, చక్రం బీడి యజమాని ముల్లా షబ్బీర్ పాఠశాల విద్యార్థులకు రూ 20 వేల విలువ చేసే 50 జతల క్రీడా దుస్తులను హెచ్ఎం కోటయ్య, పిడి దాదాపీర్‌లకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతను హెచ్ఎం, పిడి, పిఈటి భారతిలు ఘనంగా సన్మానించారు.


దాతను సన్మానిస్తున్న దృశ్యం

9 వరకు పట్టభద్రుల ఓటు నమోదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పట్టభద్రుల ఓటు నమోదుకు ఈనెల 9వ తేదీ వరకు అవకాశం ఉందని, ఇంకా ఎవరైనా వివిధ కారణాల రీత్యా నమోదు చేసుకుని వారు ఉంటే నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వివిధ కారణాల రీత్యా తిస్కరించిన ఓటుకు ఎలక్షన్ కమిషన్ మరో అవకాశం ఇచ్చిందన్నారు. బిఎల్ఓలు విచారణలో నిర్లక్ష్యం వహిస్తే మండల ఎన్నికల అధికారి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. **బనగానపల్లె :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవాలని మండల అధ్యక్షురాలు మానసవీణ, వైసిపి ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ నాయక్‌లు కోరారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు మాత్రమే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని, ఓటు నమోదు చేసుకొని వారు ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి బలపరుస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి పట్టభద్రులు మద్దతు ఇచ్చి గెలిపించాలని వారు కోరారు. **బండి ఆత్మకూర్ :** మండలంలో డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు తమ ఓట్లను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పొడిగించడంతో ఇంకా ఎవరైనా నమోదు చేసుకొని వారు ఉంటే వెంటనే చేసుకోవాలని ఎంపిపి దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి కోరారు. ఆయన మాట్లాడుతూ పట్టభద్రులైన వారు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కును పొందాలని తెలిపారు. వైసిపి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు పట్టభద్రుల ఓటు నమోదులో కీలకపాత్ర వహించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మానసవీణ, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ నాయక్


మాట్లాడుతున్న దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి

ఏడాదిలో 603 రోడ్డు ప్రమాదాలు.. 265 మంది మృతి

- రోడ్డు భద్రత ప్రమాణాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- సురక్షితంగా గమ్యం చేరాలి : ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో ఈ ఏడాది 603 రోడ్డు ప్రమాదాలు జరిగాయని, 265 మంది మృతి చెందారని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రాణం చాలా విలువైనదని, రోడ్డు భద్ర ప్రమాణాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని వాహనదారులకు సూచించారు. ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, డ్రింక్ అండ్ డ్రైవింగ్ వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాని చెప్పారు. వచ్చే ఏడాది భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోబోతున్నట్లు ప్రకటించారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా ప్రమాణాల గురించి వివరించారు. మోటార్ వెహికల్ చట్టాన్ని కఠినంగా అమలు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్) గుర్తించి ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్స్‌ను, స్టాపర్స్ బోర్డ్సను, రేడియం స్టికర్స్‌ను, డేంజర్స్ సిగ్నల్‌ను ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నంద్యాల జిల్లా ప్రజలందరూ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని ఎస్‌పి ఆకాంక్షించారు.

రామచంద్ర యాదవ్ ఇంటిపై దాడి దారుణం : టిడిపి

ప్రజాశక్తి - చాగలమర్రి

పుంగనూరు రామచంద్ర యాదవ్ ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని టిడిపి నంద్యాల పార్లమెంట్ బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు పేర్కొన్నారు. బుధవారం పుంగనూరులో రామచంద్ర యాదవ్ నివాసంలో ఆయనను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనను ప్రతి ఒక్క ఖండించాలని కోరారు. ఆయనకు సంఘీభావం తెలిపారు. అలాగే రాష్ట్ర యాదవ సంక్షేమ సంఘం నాయకులు లాకా వెంగళరావు గారితో కలిసి పరామర్శించి, సంఘీభావం తెలియజేశారు.

డెంగీ, మలేరియా నివారణకు

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయండి

- డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్ వెంకటరమణ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో డెంగీ, మలేరియా నివారణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారుల నెలవారి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు తగ్గే విధంగా ప్రతి ఒక్క సబ్ యూనిట్ అధికారి కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమం సక్రమంగా జరిగేలా సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. జిల్లా మలేరియా అధికారి వి.కామేశ్వరరావు మాట్లాడుతూ డెంగ్యూ రాపిడ్ కిట్లు సక్రమంగా వినియోగించేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచో డాక్టర్ జగదీష్ చంద్ర రెడ్డి, డెమో రవీంద్రా నాయక్, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వరప్రసాద్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ

బిసిల ద్రోహి ముఖ్యమంత్రి : కాంగ్రెస్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బిసిలకు చేసింది ఏమీ లేదని, 34 శాతం ఉన్న స్థానిక సంస్థల రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ద్రోహం చేశారని, బిసిలకు ఉన్న పథకాలన్నీ రద్దు చేశారని డిసిసి అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ మండిపడ్డారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అది జయహో బిసి మహాసభ కాదని, బిసిలపై దౌర్జన్య సభ అని అభివర్ణించారు. గత మూడు రోజుల క్రితం పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక బిసి నేతపై 200 మంది గుండాలను పంపించి దాడి చేయించడం దారుణమన్నారు. వైసిపి పేరుకు 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసిందని, వీటికి విధులు, నిధులు, అధికారాలు కల్పించకపోవడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. జగన్ ఏర్పాటు చేసిన కార్పొరేషన్‌లు ఉత్సవ విగ్రహాలుగా, గారకాయలుగా, ఆరవ వ్రేలుగా, నేతి బీరకాయలుగా తయారయ్యాయని విమర్శించారు. నామినేటెడ్ పదవుల్లో బీసీలకు మొండి చేయి చూపారని, చిత్తశుద్ధి ఉంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వివాదస్పదంగా డ్రైయినేజీ నిర్మాణం

- పరిశీలించిన జిల్లా పంచాయతీ అధికారి

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని చిన్నబోధనంలో మురికి కాలువ నిర్మాణ స్థలం వివాదస్పదంగా మారింది. దీంతో నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు బుధవారం పరిశీలించి ఆ ప్రాంత ప్రజలతో చర్చించారు. తమ సొంత స్థలంలో మురికి కాలువ నిర్మాణం ఎలా చేపడతారని ఓ టిడిపి నాయకుడు అడ్డుపడ్డాడు. గతంలో నిర్మించిన అంతర్గత మురికి కాలువను పూడ్చి వేసి దాని తర్వాత ఆ ప్రాంతంలో తమ సొంత స్థలంలో నిర్మాణం చేపట్టడం ఎంత వరకు సమంజసమని టిడిపి నాయకుడు అధికారులను ప్రశ్నించారు. రికార్డులను పరిశీలించి పాత కాలువను పునరుద్ధరించడంతో పాటు నూతన మురికి కాలువ నిర్మాణ పనులు కూడా చేపడతామని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. కార్యక్రమంలో ఇఒఆర్‌డి నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు సబియా, రాజశేఖర్, ఇంజనీరింగ్ సహాయకురాలు రుక్సానా, గ్రామ మహిళా సంరక్షణ కార్యదరి షాహిదా తదితరులు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న డిపిఓ శ్రీనివాసులు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రంగప్ప, అబ్దుల్లా

ఎస్ఎఫ్ఐ 17వ అఖిలభారత మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎస్ఎఫ్ఐ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని అఖిల భారత మహాసభల గోడపత్రికలను స్థానిక సుందరయ్య భవన్లో బుధవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీబృందం ఆవిష్కరించింది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ అఖిలభారత మహాసభలు డిసెంబర్ 13 నుండి 16 వరకు తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగే ఈ మహాసభలు దేశంలో విద్యారంగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్ళపై చర్చించి అనేక తీర్మానాలు చేసి భవిష్యత్తు పోరాటాలు రూపకల్పన చేయనుందని వారు అన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు కాలంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈనెల 13న జరిగే బహిరంగ సభకు వేలాది మంది విద్యార్థులు తరలి రావాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అమర్, సాయి కర్నూలు మండలం కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోండి

లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి శ్రీనివాసులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : మహిళల రక్షణకు ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ నుండి గాయత్రి ఎస్టేట్ వరకు స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళలపై హింస, వివక్షను నిర్మూలించే జిల్లా స్థాయి అవగాహన ర్యాలీని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ జడ్జి శ్రీనివాసులు జెండా ఊపి ప్రారంభించారు. గాయత్రి ఎస్టేట్ దగ్గర వెళ్లిన ర్యాలీ మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం జడ్జి శ్రీనివాసులు ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నవంబరు 25 నుండి డిసెంబర్ 10 వరకు మహిళలపై హింస, వివక్ష, వ్యతిరేకతను నిర్మూలించే అవగాహన కార్యక్రమలు జిల్లాలో పాటు మండలాల్లో కూడ నిర్వహించుకుంటున్నామ అన్నారు. స్త్రీలకు ఎలాంటి ఆటంకం కలిగిన న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి కుమారి, డాక్టర్ మాధవి శ్యామల, జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డి, కార్మిక శాఖ డిసిఎల్ వెంకటేశ్వర్లు, సిడిపిఒలు, అంగన్వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, ఎన్‌సిసి క్యాడేట్స్, మహిళా ఉద్యోగులు, పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఎఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. కళాశాల కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వెంకటేష్ మా భాషతో పాటు 29 మందితో కమిటీ ఏర్పడిందని జిల్లా అధ్యక్షుడు సోమన్న తెలిపారు.

ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో వసూలు చేస్తున్న ఫీజులపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అఖండ, మహేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యుజిసి , ఉన్నత విద్యా మండలి ఆదేశాలకు విరుద్ధంగా ఫీజులను వసూలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా యూనివర్సిటీ అధికారులు జోక్యం చేసుకొని విచారణ చేయాలన్నారు.

చిన్నవయసులోనే గుండె సమస్యలు

యువకుడి ప్రాణాలు కాపాడిన కిమ్స్ వైద్యులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : పెద్ద వయసులో ఉన్నవారికి గుండెపోటు రావడం సర్వసాధారణం. కానీ, ఇపవిడు అతి చిన్నవయసు వారికీ గుండె సమస్యలు కనిపిస్తున్నాయి. కేవలం 20 ఏళ్ల వయసులోనే ఎక్కువగా సిగరెట్లు కాల్చడం వల్ల రకరకాల సమస్యలతో చివరకు గుండెపోటుకు గురైన యువకుడి ప్రాణాలను కర్నూలు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు కాపాడారు. ఈ కేసు వివరాలను కిమ్స్ హాస్పిటల్ కర్నూలుకు చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ చింతారాజ్ కుమార్ వెల్లడించారు. ఆయన మాటల్లో ....కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన 20 ఏళ్ల ఏసురత్నం డ్రైవర్ పని చేస్తున్నాడు. అతడు తీవ్రమైన ఛాతీ నొప్పితో ఆస్పత్రికి వచ్చాడు. ముందుగా ఇసిజి, 2డిఎకో, అనంతరం యాంజియోగ్రామ్ లాంటి పరీక్షలు చేసిన తర్వాత.. అతడి గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడినట్లు తేలింది. అత్య వసర పరిస్థితులలో స్టెంట్ వేయాల్సి రావడంతో ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఈ శస్త్రచికిత్స చేశాం. ఇప్పుడు పూర్తిగా కోలు కోవ డంతో డిశ్చార్జి చేశాం. ప్రస్తుతం అతడు సాధా రణ జీవితాన్ని కొనసాగిస్తున్నాడు. ఇంత చిన్న వయ సులో గుండె పోటు రావడం చాలా అరుదు. ఆయనకు తక్కువ వయసులోనే గుండెపోటు వచ్చింది. ఇందుకు ప్రధాన కారణం సిగరెట్లు కాల్చడం. రోజుకు దాదాపు 20 సిగరెట్ల వరకు కాల్చేవాడు. దీంతో అతనికి చెడు కొలెస్ట్రాల్ రక్తంలో ఎక్కువగా ఉన్నదని తేలింది. భవిష్యత్తులోనూ ఈ రోగి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ధూమపానం పూర్తిగా మానేయాలి, దాంతోపాటు జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుంది. వైద్యుల సలహాలను పాటించాలి. ఈ సమస్య, దాని కారణాలు, ఇతర అంశాలను కూడా డాక్టర్ చింతా రాజ్ కుమార్ వివరించారు. ఈ సమస్యను వైద్యపరిభాషలో మయోకార్డియల్ ఇన్ ఫార్క్షన్ (ఎంఐ) అంటారు. దీనిపై కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో పరిశోధన చేశారు. 40 ఏళ్లలోపు వయసున్న 100 మంది ఎంఐ రోగులను పరీక్షించారు. భారతదేశంలో ఈ సమస్య ఉన్నవారిలో అత్యంత తక్కువ వయసున్నరోగి 19 ఏళ్లవారు. కర్నూలులో 20 నుంచి 27 సంవత్సరాల వయసున్న రెండు కేసులు ఒకే నెలలో కిమ్స్ కర్నూలులో నమోదైనాయి. 40 ఏళ్లలోపు ఈ సమస్య వచ్చే అవకాశాలు 2శాతం మాత్రమే. దక్షిణాసియాలో ఇతర దేశాలవారి కంటే భారతీయుల్లో తక్కువ వయసులోనే కరొనరీ హార్ట్ డిసీజ్ వచ్చేందుకు అవకాశాలు మూడు రెట్లు ఎక్కువ. ధూమపానం, నెయ్యి వాడకం, పరగడుపున రక్తంలో గ్లూకోజ్ ఎక్కువ ఉండటం, అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు, శారీరక వ్యాయామం బాగా తగ్గడం, తల్లిదండ్రుల్లో , తోబుట్టువులలో ఎవరికైన గుండెపోటు వచ్చినా కానీ ముందుగానే ఎంఐ సమస్య ఉండటం, లిపోప్రోటీన్-ఎ (ఎల్.పి.-ఎ), హైపర్ హోమోసిస్టెనీమియా, హైపర్ కాగ్యులబుల్ పరిస్థితి, కొకైన్ వాడకం లాంటివాటివల్ల ఈ సమస్యలు వస్తాయి. ధూమపానం (72 శాతం), హైపర్ కొలెస్ట్రాలేమియా (52శాతం), కుటుంబంలో ఎవరికైనా హార్ట్‌ఎటాక్ చరిత్ర (35శాతం) లాంటివి యువతలో ముప్పునకు ప్రధాన కారణాలు.

ఇవి కాక ఇంకా మరికొన్నీ ఉన్నాయి. ఇతర జనాభాతో పోలిస్తే భారతీ యుల్లో గుండె పోటు వ్యాధి ప్రధాన లక్షణాలు. 2-4 రెట్లు అధిక ప్రాబల్యం, మొదటి ఎంఐ ప్రారంభం కావడానికి 5-10 సంవత్సరాల ముందు యువతలో (45 ఏళ్లకంటే ముందు) 5-10 రెట్లు ఎక్కువగా ఎంఐ వ్యాధి, మరణాల రేటు సంప్రదాయ ప్రమాద కారకాల ప్రాబల్యం తక్కువ, అభివృద్ధి చెందుతున్న ప్రమాద కారకాల ప్రాబల్యం ఎక్కువ.


చికిత్స పొందిన యువకుడు

ఘనంగా శ్రీ దత్త జయంతి వేడుకలు

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

శ్రీ అవధూత రామిరెడ్డి తాత సేవా సంస్థాన్ కల్లూరు నందు శ్రీ దత్త జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ తాత గారి సమాధి మందిరం నందు ఉదయం మేలుకొలుపు, పంచామృత అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు, అలంకరణ, మహా హారతి, పల్లకి ఉత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీ అవధూత రామిరెడ్డి తాత 30వ ఆరాధన కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు భజన, అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీ అవధూత రాంరెడ్డి తాత సేవా సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ శ్రీ అవధూత రామిరెడ్డి తాత సశరీరులుగా ఉన్నప్పుడే ఏర్పడిన లిశ్రీ శ్రీ శ్రీ అవధూత రాంరెడ్డి తాత సేవ సంస్థానం ఆనాటి నుండి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. తాత సమాధి చెందిన తర్వాత కూడా వారు ప్రత్యక్షంగా ఉన్నారన్న నమ్మకం నిజదర్శనములతో అనేక సామాజహిత కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తూ ఎందరికో చేయూతను అందిస్తున్నదన్నారు. శ్రీ అవధూత రామరెడ్డి తాత 30వ ఆరాధన ఉత్సవ కార్యక్రమం జనవరి 16 సోమవారం (కనుమ) 2023 న అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఆనాటి నుండి ఈ సేవా కార్యక్రమాలను ఇంకా కొనసాగించడానికి సంస్థానం సాయశక్తులా కృషి చేస్తున్నదన్నారు. భక్తులందరూ తాత ఆరాధన మహోత్సవంల తోపాటు సేవ కార్యక్రమాలలో విశేషంగా పాల్గొని తాత ఆశీస్సులు పొందగలరన్నారు. ఆధ్యాత్మిక ధార్మిక సంస్థల ప్రతినిధులు శ్రీ లలితా పీఠం పీఠాధిపతి మేడాసుబ్రహ్మణ్యం, రుక్మిణి పాండురంగ దేవాలయం (చిన్నటేకూరు) పీఠాధిపతులు శ్రీ ఎల్లప్ప స్వామి, డాక్టర్ మల్లు వెంకట్ రెడ్డి హిందూ ధర్మ ప్రచార పరిషత్, డాక్టర్ శ్రీరాములు, వైద్యం రామానాయుడు, రామాంజనేయులు హనుమాన్ జంక్షన్ వెల్దుర్తి, శ్రీలక్ష్మి రెడ్డి బొమ్మిరెడ్డి పల్లె, కల్లూరు గ్రామ పెద్దలు, తాత భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న నిర్వహకులు

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - చాగలమర్రి

నల్లమల అటవీ ప్రాంతంలోని ఎర్రచందనం చెట్లు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతని చాగలమర్రి మండలం అటవీ శాఖ అధికారి కిషోర్ కుమార్ తెలియజేశారు. నంద్యాల డిఎఫ్ఓ,రుద్రవరం రేంజర్ శ్రీపతి నాయుడు ఆదేశాల మేరకు మండలంలోని ఓజి తండా, ఎం.తండా , కేపీ తండా, చెంచుగూడెం గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణ , ఎర్రచందనం చెట్ల నరికివేతను అరికట్టడంపై వనచైతన్య రథం ద్వారా, చిత్రప్రదర్శన ద్వారా బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవికి నిప్పుపెట్టడం ప్రాణముప్పులాంటిదన్నారు. వన్యప్రాణులు, అడవి జంతువులను వేటాడితే వన్యప్రాణుల సంరక్షణ చట్టం కింద శిక్షార్హులౌతారన్నారు . కార్యక్రమంలో ఎఫ్‌బిఓలు నగేష్ , సుభాష్ , మదన్ గోపాల్ పాల్గొన్నారు .



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌టియు అధ్యక్షులు గోకారి

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట ఎస్‌టియు ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : దీర్ఘకాలికంగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్‌టియు నేతలు గోకారి, జనార్దన్, నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులతో ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి ,ప్రధాన కార్యదర్శి టికె.జనార్దన్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి దేవా ప్రసన్న రాజులు పాల్గొని మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ఒక వారంలో సిపిఎస్ ను రద్దు చేస్తామని, ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి , పిఆర్‌సి డిఎలలను సకాలంలో చెల్లిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి జగన్ వచ్చారన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, పంజాబ్, ఝార్ఖండ్ రాష్ట్రాలు సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేస్తున్నాయన్నారు. అక్కడ సాధ్యమైనది ఇక్కడ ఎందుకు సాధ్యం కాదని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న జడ్‌పిఎఫ్, ఎపిజిఎఫ్ రుణాలు, సరెండర్ లీవులు సత్వరమే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో డిసెంబర్ 20న విజయవాడలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్థిక కార్యదర్శి రామ్ మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు రమేష్, షఫీ, బసవరాజు,నాగరాజు, వెంకటేశ్వర్లు, వీరచంద్ర యాదవ్, విక్టర్, నాగరాజు, రాముడు, సుధీర్ పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్ర జ్యోతి దర్శన యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

తమిళనాడులోని అరుణాచల క్షేత్రానికి ఈనెల తొమ్మిదిన శుక్రవారం రోజున కర్నూలు-1 డిపో సూపర్ లగ్జరీ బస్సు (2+2 పుష్ బ్యాక్) (సర్వీస్ నంబర్ 93942) నడుపుతున్నామని ఎపిఎస్‌టిసి ఆర్ టివి.రామం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు కర్నూలు నుంచి బస్సు బయలుదేరి మరుసటి రోజు శనివారం (10 వ తేదీన) ఉదయం 6 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర దర్శనం అనంతరం అదే రోజు సాయంత్రం 4 గంటలకు బయలుదేరి, మార్గమధ్యంలో వేలూరు, గోల్డెన్ టెంపుల్ దర్శన అనంతరం , 11వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుంది. రాకపోకలకు బస్సు చార్జీ రూ.2 వేలు. ముందస్తు రిజర్వేషన్ టిక్కెట్లు ఆన్లైన్ (apsrtconline.in)లో , ఎపిఎస్ఆర్‌టిసి బస్‌స్టేషన్లలో , ఎపిఎస్ఆర్‌టిసి అధీకృత ఏజెంట్ల వద్ద కూడా లభించునని తెలిపారు. మరిన్ని వివరాలకు కర్నూలు - 1 డిపో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ను 7702774358 నెంబర్ లో సంప్రదించాలన్నారు.





మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

15 తరువాతే..!

- ఉద్యోగుల జీతాలు, పెన్షన్ల చెల్లింపు ఆలస్యం
- సకాలంలో చెల్లించలేకపోతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు పెన్షన్ల చెల్లింపులు నెల నెలకూ ఆలస్యం అవుతూనే ఉన్నాయి. ఈ నెలలో 15 తరువాతే చెల్లింపులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రభుత్వం సకాలంలో వేతనాలు, పెన్షన్లను చెల్లించలేకపోవడంపై ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది...

జిల్లాలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీతాల కోసం, పెన్షనర్లు పెన్షన్ల కోసం ప్రతి నెలా ఎదురు చూడాల్సి వస్తోంది. సకాలంలో అవి అందక, ఇఎంఐలు చెల్లించలేక, ఇతర అవసరాలు తీర్చుకోలేక అల్లాడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 45 వేల మంది ఉద్యోగులు, 15 వేల మంది ఉపాధ్యాయులు, 5 వేల మంది పెన్షనర్లు ఉన్నారు. గత నెల 10వ తేదీ తరువాత వేతనాలు, పెన్షన్లను ఖాతాల్లో జమ చేశారు. ప్రస్తుతానికి ప్రతిరోజూ కొందరికి జీతాలను చెల్లిస్తున్నారు. అందరికీ చెల్లింపులు పూర్తయ్యేసరికి ఈ నెల 15వ తేదీ దాటుతుందనేది అంచనా. సాధారణంగా వేస్ అండ్ మీన్స్, ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం, ఓవర్ డ్రాఫ్ట్ సౌలభ్యం పేరిట రాష్ట్రం అప్పుల వెసులుబాటు వినియోగించుకుంటూ ఉంటుంది. ఓవర్ డ్రాఫ్ట్ పేరుతో వినియోగిం చుకోదగ్గ మొత్తమూ అంతంతే. పైగా నిర్దిష్ట గడువులోగా వాటిని తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. అందులోనూ ఇబ్బందులు ఉన్నాయి. రాష్ట్రంలో ఇంకా రూ.2,900 కోట్లు పింఛన్లు, జీతాలు కలిపి చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బహిరంగ మార్కెట్లో రుణం తీసుకోవాలంటే దానికీ పరిమితులు ఉన్నాయి. ఇప్పటికే ఎపి తన పరిమితిని దాటేసింది. అంటే ఈ నెల అప్పు కూడా పుట్టదు. మరో వైపు కార్పొరేషన్ల నుంచి రుణం తీసుకునే అవకాశమూ లేదు. ఈ నెల ప్రారంభంలో రూ.2,000 కోట్లను ఏదో కార్పొరేషన్ పేరిట బ్యాంకుల నుంచి అప్పు తీసుకుని, రాష్ట్ర అవస రాల కోసం సర్దుబాటు చేసేశారు. ఇప్పటికే మద్యం సొమ్ముల పేరుతో రూ.8,300 కోట్లు, ఇతరత్రా కార్పొరేషన్ల పేరుతో మరో రూ.12,000 కోట్ల రుణాలు ప్రభుత్వం వినియోగించుకున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఇతరత్రా అవసరాలు పోను రోజువారీ రాబడిలో ఎంత మొత్తం జీతాలకు, పింఛన్లకు చెల్లిస్తారనే అంశంపైనే నవంబరు జీతాలన్నీ ఎప్పటికి చెల్లించగలరో తేలనుంది. గత నెల 10వ తేదీ పైన వేతనాలు పడటం, ఈ నెల 15 తరువాత అంటుండటంతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రచారం



పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - పాణ్యం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ పోతుల నాగరాజుకు మద్దతుగా ప్రజా సంఘాల నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ, ఎఐఎస్‌బి స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం వెంకటాద్రి, ఆర్‌విఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి రియాజ్, హరి, నవీన్, రమణ, సూర్య కుమార్, సురేష్, మనోహర్, రాజేష్, అనిల్ తదితరులు పాణ్యంలో పట్టభద్రులను, నిరుద్యోగులను కలిసి డాక్టర్ పోతుల నాగరాజుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. డాక్టర్ పోతుల నాగరాజు దాదాపు 33 సంవత్సరాల నుండి ప్రజా ఉద్యమాలలో పని చేస్తూ, ప్రభుత్వ ఉపాధ్యాయునిగా కొద్ది రోజులు పని చేసి 2007లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ చేసి కేవలం 454 ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎవరైతే నిరుద్యోగుల కోసం, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల కోసం, రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కోసం, ప్రభుత్వ ఉద్యోగుల హక్కుల కోసం శాసనమండలిలో మాట్లాడుతారో అలాంటి పోతుల నాగరాజుకు ఓటు వేయాలన్నారు. మార్చిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, ఎస్‌టియు, యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు, జర్నలిస్టులు, మేధావులు, విద్యావంతులు, జనవిజ్ఞాన వేదిక, ఎస్కే యూనివర్సిటీ, రాయలసీమ యూనివర్సిటీ, ఎస్వీ యూనివర్సిటీ, యోగి వేమన యూనివర్సిటీల అందరి మద్దతుతో పోటీ చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి
- కలెక్టరేట్ వద్ద ఎస్‌టియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఎస్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. ఎస్టియు రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వం అనుసరిస్తున్న సాచివేత ధోరణిని నిరసిస్తూ బుధవారం నంద్యాల జిల్లా కలెక్టరేట్ ముందు ఎస్టియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అజాం బేగ్, మౌలాలి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేస్తూ ఉద్యోగులకు హక్కుగా రావలసిన పిఆర్‌సి, డిఎ అరియర్స్, సరెండర్ లీవు బకాయిలను నెలల తరబడి జాప్యం చేయడం దుర్మార్గమని అన్నారు. నవంబర్ నెల జీతాలు డిసెంబర్ 7వ తేదీ వచ్చిన ఉద్యోగుల బ్యాంకు ఖాతాలో జమ కాకపోవడం దారుణమన్నారు.



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిలబడి ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌టియు నాయకులు

రాష్ట్ర సహాధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు గోపాలకృష్ణ, కార్యదర్శి ఇగ్బాల్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం సాగదీయడం తప్ప సాధించింది ఏమీ లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర మాజీ అదనపు ప్రధాన కార్యదర్శి జీవి ప్రసాద్ రెడ్డి, సాంకేతిక కమిటీ కన్వీనర్ నాగేంద్ర కుమార్, జిల్లా మాజీ అధ్యక్షులు ప్రసాద్, శ్రీనివాసులు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తామని రూట్ మ్యాప్‌లంటూ, కమిటీలు అంటూ కాలయాపన చేసి చివరికి చేతకాలని తప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాలయాపన చేస్తూ పోతే ఈ నెల 20న రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌టియు ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట్రాం రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు నాగరాజు, రమణ ,ప్రసాద్ రావు, ఉపాధ్యాయ వాణి జిల్లా కన్వీనర్ సుబ్బయ్య, సిపిఎస్ జిల్లా కన్వీనర్ చిన్నపరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, వెంకటేశ్వర రెడ్డి సోషల్ మీడియా కన్వీనర్ దేవేందర్ రెడ్డి ఆఫీస్ ఇంచార్జి సుబ్బయ్య సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు బయలు దేరిన ఎస్టీయు నాయకులు

ప్యాపిలి : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఎస్టియు నంద్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల కలెక్టరేట్ వద్ద జరుగుతున్న ధర్నాలో పాల్గొనడానికి ఎస్‌టియు జిల్లా శాఖ ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో బయలు దేరి వెళ్లారు. నాయకులు చంద్రమౌళి, చిన్నప రెడ్డి, హాజీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి 340సికి

భూముల ధరలు నిర్ధారించండి

- ఇళ్ల పట్టాలకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జాతీయ రహదారులు 340సి, 167కె కి సంబంధించి భూములకు మార్కెట్ ధర నిర్ధారించి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ సంబంధిత ఆర్డీఓలు, తాసిల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాతీయ రహదారుల భూసేకరణకు సంబంధించి మార్కెట్ నిర్ధారణ, అవార్డు ఎంక్వయిరీ సంబంధిత అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి 340సికి సంబంధించి 224 హెక్టార్లలో భూ సేకరణ పూర్తయిన ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా,నందికొట్కూరు మండలాల్లోని భూములకు మార్కెట్ ధర నిర్ధారించి నివేదిక ఇవ్వాలని ఆత్మకూరు ఆర్డీవో ఎం.దాసును ఆదేశించారు. మార్కెట్ ధర నిర్ధారణ పూర్తయిన వెంటనే సంబంధిత భూములకు అవార్డు పాస్ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. 167కె కి సంబంధించి నంద్యాల, బండి ఆత్మకూరు, వెలుగోడు, ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో ఉన్న 220 హెక్టార్లలో అలైన్మెంట్ మార్పులు, పెగ్ మార్కింగ్ చేసిన ప్రదేశాల్లో మార్పులు తత్సంబంధిత 13 అభ్యంతరాలను ఏపీఆర్డీసీ ఈఈ, సంబంధిత తాసిల్దార్లు, నేషనల్ హైవే అధికారులు సంయుక్త తనిఖీలు నిర్వహించి వాస్తవ నివేదికలను ఇవ్వాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ జాతీయ రహదారి 340సికి సంబంధించిన భూముల విలువలను నిర్ధారించి ఈనెల 13వ తేదీలోగా నివేదికలు ఇవ్వాలని ఆత్మకూరు ఆర్డీవోను ఆదేశించారు. జూపాడు బంగ్లా మండలం బన్నూరు గ్రామంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను నిబంధనల ప్రకారం సంబంధీకులపై చర్యలు తీసుకొని స్వాధీనం చేసుకోవాలని తాసిల్దారును ఆదేశించారు. ఇళ్ల పట్టాలకు అవసరమైన భూములు, రైల్వే, ఆర్ అండ్ బి, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, నంద్యాల, ఆత్మకూరు ఆర్డీఓలు శ్రీనివాసులు, ఎమ్.దాసు, నేషనల్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ బలరామ కృష్ణయ్య, సైట్ ఇంజనీర్ రామ్ కుమార్, నేషనల్ హైవే తాసిల్దార్ గుర్రప్ప శెట్టి, సంబంధిత మండల తాసిల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

జి.జంబులదిన్నెలో ఉద్రిక్తత

- కాలువల వెడల్పు కోసం ఆక్రమణలు తొలగించేందుకు అధికారుల ప్రయత్నం
- బాధితునికి అండగా మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ధర్నా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని జి.జంబులదిన్నె గ్రామంలో బుధవారం కాల్వ పేరుతో చేపడుతున్న ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. జి.జంబులదిన్నె గ్రామానికి చెందిన బోయ నాగరాజు దంపతులు షాపును పెట్టుకుని కొంతకాలంగా జీవనం కొన సాగిస్తున్నారు. కాలువల వెడల్పు కార్యక్రమంలో భాగంగా ఆక్రమణలను తొలగించే ప్రక్రియకు గ్రామ పంచాయతీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా కాల్వ మీద ఉన్న బోయ నాగ రాజు దుకాణాన్ని తొలగించేందుకు అధికారులు పోలీసుల సహాయంతో ప్రయత్నం చేశారు. విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆమె సోదరుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు జంబులదిన్నె గ్రామానికి చేరుకున్నారు. షాపును ఎలా కూల్చి వేస్తారంటూ బోయ నాగరాజు దంపతులకు అండగా గ్రామంలోని రోడ్డుపై బైటయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి భూమా అఖిలప్రియ మాట్లాడుతూ స్థానిక వైసిపి నాయకుల ప్రోద్బలంతో పంచాయతీ సెక్రెటరీ షాపును కూల్చివేసేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. బోయ నాగరాజుకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే దౌర్జన్యంగా కూల్చేందుకు అధికారులు సిద్ధమయ్యారని విమర్శించారు. భూమా అఖిలప్రియకు ఈఓపిఆర్డి పాపా రాయుడు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఆమె ససేమిరా అన్నారు. బాధితునికి న్యాయం జరిగేంత వరకు జి జంబులదిన్నె గ్రామాన్ని వదిలిపెట్టేది లేదన్నారు. పరిస్థితి ఉద్రిక్తతగా మారే అవకాశం ఉండడంతో సిఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఇది ఇలా ఉండగా మూడు నెలల క్రితమే నాగరాజుకు నోటీసులు ఇచ్చామని పంచాయతీ అధికారులు చెప్పడం గమనార్హం.



నిరసన తెలియజేస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

శ్రీశైల క్షేత్రంలో గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల దేవస్థానంలో బుధవారం పౌర్ణమిని పురస్కరించుకొని గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంకాలం స్వామి అమ్మవార్లకు మహా మంగళహారతులు, అనంతరం ఉత్సవమూర్తులను పల్లకిలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఊరేగింపుగా గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, భక్తులు, సాధువులు, స్థానికులు పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన : పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి లక్ష కుంకుమార్చన కార్యక్రమము జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పరోక్ష సేవగా పాల్గొనే అవకాశం కూడా కల్పించారు. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి భక్తులు పాల్గొన్నారు. బ్రిటన్, అమెరికా దేశాల నుండి కూడా పలువురు ప్రవాస భారతీయులు ఈ సేవలో పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు ఊయల, పల్లకీ సేవలు : శ్రీశైల క్షేత్రంలోని స్వామి అమ్మవార్లకు లోక కల్యాణం కోసం పౌర్ణమిని పురస్కరించుకొని దేవస్థానం ప్రత్యేక ఊయల సేవ కార్యక్రమాన్ని నిర్వహించింది. స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉయల సేవలో ఏర్పాటు చేసి విశేష కార్యక్రమాలు, పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయ ప్రాంగణంలోని ఉత్తరముఖంగా కలిగిన జ్వాల వీరభద్ర స్వామికి, శ్రీశైలంకి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సాక్షిగణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరికి గిట్టుబాటు ధర కల్పించాలి

- కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - సిరివెళ్ల

ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎపి కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ మార్క్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు కరిముల్లాలు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో సన్న కారు రైతులు సాగు చేసిన వరి పంటను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్ల బస్తాకు రూ.2500 చొప్పున ప్రభుత్వం ఇవ్వాలని, ప్రైవేట్ వ్యాపారస్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మల్యాల ఎత్తిపోతల నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి

పగిడ్యాల : మల్యాల ఎత్తిపోతల పథకం ఫేస్-2 నుంచి రబీలో సాగు చేసిన పంటలకు బుధవారం నీటిని విడుదల చేశారు. పైపులైన్లు శిథిలమవడంతో దాదాపు రూ.10 లక్షలతో మరమ్మతులు చేశారు. రబీలో సాగు చేసిన పంటలు దెబ్బతినకుండా నీటిని విడుదల చేశారు. నీటిని విడుదల చేసినందుకు కొణిదేల, పగిడ్యాల, లక్ష్మాపురం గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం, పిఎంఈజిపి తదితర పథకాల ద్వారా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేసి నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్ జిల్లా పరిశ్రమల మేనేజర్‌ను ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షులు రాజమహేంద్రనాథ్, జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస యాదవ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు నూతన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో పాటు వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన తదితర పథకాల ద్వారా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చిన్న తరహా పరిశ్రమలలో ఉత్పత్తుల తయారీ, సేవా రంగానికి దాదాపు 7 కోట్ల రూపాయలకు సంబంధించి రాయితీలు మంజూరు చేస్తున్నామన్నారు. పారిశ్రామిక అభివద్ధికి సంబంధించి స్టాండప్ ఇండియా, పిఎంఈజిపి తదితర పథకాల ద్వారా యువ పారిశ్రామిక వేత్తలను గుర్తించాలన్నారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద పెండింగ్లో ఉన్న దరఖాస్తులను బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించాలని లీడ్ బ్యాంకు మేనేజర్‌ను ఆదేశించారు. బేతంచెర్ల క్లస్టర్‌కు సంబంధించిన భూసంబంధిత విషయాన్ని త్వరలో పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ రాష్ట్ర అధ్యక్షులు రాజమహేంద్రనాథ్ మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి ఎంతో అవసరమని, ఇందుకవసరమైన రుణాలను బ్యాంకుల ద్వారా ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ ప్రెసిడెంట్ రామలింగారెడ్డి, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా దిలీప్‌రాజు

ప్రజాశక్తి - జూపాడుబంగ్లా

ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా దిలీప్ రాజు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయనను పలువురు ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. దిలీప్ రాజు విద్యార్థి నాయకుడి నుంచి ఒక యువనేతగా ఎదుగుతూ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా విద్యార్థి సంస్థలో పని చేస్తూ వైఎస్ఆర్‌సిపి విద్యార్థి నాయకునిగా ఎదిగారు. అభ్యుదయ భావాలు కలిగిన సంస్థల్లో పని చేస్తూ నేడు నంద్యాల జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్‌గా ఎన్నిక కావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూపాడుబంగ్లా ఎంపీటీసీ కృపాకర్ కుమారుడైన దిలీప్ రాజు భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ప్రజా సంఘాల నాయకులు ఆకాంక్షించారు. అనంతరం దిలీప్ రాజు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల కోసం అనునిత్యం పోరాడుతానని, తనకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఎమ్మెల్యే ఆర్థర్‌కు మంచి పేరు తెస్తానని చెప్పారు. తనను గుర్తించిన ఎమ్మెల్యే ఆర్థర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోట్టే బాలయ్య, ఎంపీటీసీ కృపాకర్, జంగాల పెద్దన్న, వినయ్, ప్రజా సంఘాల నాయకులు రమేష్, దళిత నాయకులు మల్లయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



దిలీప్ రాజును సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరు కావాలి : జెడ్పిటిసి

ప్రజాశక్తి - పగిడ్యాల

ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని జెడ్పిటిసి పుల్యాల దివ్య అన్నారు. బుధవారం పగిడ్యాల ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి పుల్యాల దివ్య మాట్లాడారు. సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు పూర్తి స్థాయిలో హాజరు కావడంలేదన్నారు. పూర్తి స్థాయిలో ప్రజా ప్రతినిధులు హాజరైతే గ్రామాల్లోని సమస్యలు పరిష్కారానికి అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల సమస్యలను సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొస్తే తీర్మాణాలు చేసి సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఎంపిటిసి గోపాల్ గ్రామంలో దోమలు అధికంగా ఉన్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఫాగింగ్ మిషన్‌తో దోమల నివారణ చర్యలు చేపడతామని ఇఒఆర్‌డి పుల్లయ్య సమాధానం ఇచ్చారు. రేషన్ షాపులలో బియ్యం, కందిబ్యాళ్ళు,చెక్కర,ఉప్పు, నూనె ఎందుకు ఇవ్వడం లేదని ఎంపిపి మల్లేశ్వరి తహశీల్దార్ భారతిని ప్రశ్నించారు. పై నుంచి ఒక్క బియ్యం మాత్రమే వస్తున్నాయని, మిగతా వస్తువులు రావడం లేదని తహశీల్దార్ సమాధానం ఇచ్చారు. కర్నూలు జనరల్‌బాడీ సమావేశంలో అన్ని ఇస్తున్నామని చెప్పుతుంటే మీరేమో ఏమీ రావడం లేదని చెబుతున్నారని ఎంపిపి ప్రశ్నించారు. తెలుసుకుని డీలర్లతో డిడి తీయించి సరఫరా చేయిస్తామని తహశీల్దార్ తెలిపారు. నెహ్రూనగర్ గ్రామం ప్రజలు ఏ ధ్రువ పత్రాలు తీసుకున్నా మూర్వకొండ పేరు వస్తుందని, అలా కాకుండా నెహ్రూనగర్ గ్రామం పేరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్పంచు కూరాకుల రాజేశ్వరి కోరారు. కార్యక్రమంలో సిడిపిఒ కోటేశ్వరమ్మ, ఎంఇఒ సుభాన్, పిఆర్ఎఇ వెంకటేశ్వర్లు, ఎఒ జ్యోతికుమార్, ఎపిఒ మద్దిలేటి, ఎపిఎం శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శివ కుమార్, విద్యుత్‌శాఖ ఎఇ క్రాంతికుమార్, ఉపాధ్యక్షురాలు పల్లే అరుణమ్మ, ఎంపిటిసిలు గోపాల్, కళావతి, జయంతి, గౌరమ్మ, సర్పంచులు శేషన్న, రాజేశ్వరి, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతన్నా జెడ్పిటిసి పుల్యాల దివ్య



ఘనంగా కాశిరెడ్డి నాయన ఆరాధోత్సవం

కొలిమిగుండ్ల : కొలిమిగుండ్లలోని నాయనపల్లె రస్తాలో వెలసిన కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో ఆరాధనోత్సవాల్లో భాగంగా పేరం బైపిరెడ్డి, పేరం నందకిషోర్ రెడ్డి, పేరం సూర్య నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అభిషేకం, అర్చనలు, పూజలు, అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ, అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం బైపిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి ఉత్సవాలు అందరూ కలిసి జరుపుకుంటే ఆనందంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో పేరం ఆదినారాయణ రెడ్డి, పేరం నాగేశ్వర్ రెడ్డి, నాని యాతం వెంకటరామిరెడ్డి, పల్లె సుదర్శన్ రెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి

చాగలమర్రి : మండలంలోని మద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న వేణుగోపాల్ (57) బుధవారం పాఠశాలలోనే గుండెపోటుకు గురై మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. దొర్నిపాడుకు చెందిన వేణుగోపాల్ మద్దూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. రోజులాగే పాఠశాలకు విధులకు హాజరయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత వాంతులు చేసుకుని ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. వెంటనే అక్కడి ఉపాధ్యాయులు చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఉపాధ్యాయుడి మతికి ఎంఈవో అనురాధ, హెచ్‌ఎం సురేష్ బాబు , వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

ఆళ్లగడ్డలో 9న జాబ్ మేళా

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 9న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు శాసనసభ్యులు గంగుల బిజేంద్ర రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా ఉపాధి డిఆర్డిఎ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీ డ్యాప్ ఆధ్వర్యంలో 12 జాతీయ కంపెనీలలో పని చేయుటకు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ, బిటెక్, పీజీ లలో ఏదైనా బ్రాంచ్ పూర్తి చేసిన వారు నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, ఎపిఎం రామశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి రామ గోపాల్ రెడ్డిని గెలిపించండి : టిడిపి

సిరివెళ్ల : వచ్చే ఏడాది మార్చిలో జరగబోయే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి బలపరిచిన భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. అన్ని ప్రయివేటు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పని చేస్తున్న గ్రాడ్యుయేట్స్‌ను కలిసి భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డికి ఓటు వేసి వేయించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యామ గురప్ప, ఆళ్లగడ్డ తాలూకా తెలుగు యువత సెక్రెటరీ నంద్యాల సిద్ధిక్ , యువ నాయకులు బి.ఎమ్.డి రఫీ, ఐ టిడిపి యునుస్, యువ నాయకులు నంద్యాల ఇర్ఫాన్, లింగమయ్య పాల్గొన్నారు.

వరిలో పంట కోత ప్రయోగం

సిరివెళ్ల : శిరివెళ్లలోని రైతు భరోసా కేంద్రం-1 పరిధిలో ప్రధానమంత్రి ఫసల్ బీమాకి సంబంధించి వరిలో పంట కోత ప్రయోగం బుధవారం నిర్వహించారు. 5-5 మీటర్లలో వరి పంటను కోసి దిగుబడి అంచనా వేశారు. 19.5 కేజీల దిగుబడి వచ్చింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈ సుధాకర్, వ్యవసాయ విస్తరణ అధికారులు పి రాజేశ్వర్ రెడ్డి, సాదు శ్రీనివాసులు, ఎంపీఈఓ నాగలక్ష్మి, నాగరాజు, ఇన్సూరెన్స్ అధికారి మురళి, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

బేతంచర్ల : వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే వరకు పోరాటాలు కొనసాగిస్తామని వాల్మీకి పోరాట సమితి యువసేన మండల అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ముద్దవరం గ్రామ పంచాయతీలోని ముసలాయి చెరువు గ్రామంలో గౌరవాధ్యక్షులు పుట్టపాశం వెంకటేశ్వర్లు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం వాల్మీక యువసేన నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పుట్టపాశం వెంకటేశ్వర్లు, దొడ్డి నాగరాజు, పెద్దమద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

బండి ఆత్మకూర్ : మండలంలోని జిసి పాలెం నారాయణపురం రహదారిలో బుధవారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో నలుగురికి గాయాలైనట్లు ఎస్సై బాబు తెలిపారు. వివరాలు.. నారపురెడ్డి కుంట గూడెంకి చెందిన రాజు, అతని స్నేహితులు కలిసి నెమల్లకుంట చెంచుగూడెంలో నాటు సారా తాగి, నాటు సారా ఒక లీటర్ బాటిల్ తీసుకొని నారపరెడ్డి కుంటకు వెళుతుండగా జిసి పాలెం చెరువు సమీపంలో నారాయణపురం నుండి వస్తున్న రాజేష్, జాన్‌పాల్‌లు జిసి పాలెం వైపు బైక్‌పై వెళుతుండగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వేరు కుళ్లు, తెగుళ్లపై అవగాహన సదస్సు

పాములపాడు : మండలంలోని మద్దూరు గ్రామంలో వ్యవసాయ సాకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ పథకంలో భాగంగా వివిధ పంటల్లో నేల ద్వారా సంక్రమించు వేరు కుళ్లు, కాండం ఆకుల్లో, మచ్చ తెగుళ్ల నివారణపై అవగాహన సదస్సు మండల వ్యవసాయ అధికారి పణీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి హేమలత హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. ఏఈఓ మద్దిలేటి, అన్ని గ్రామాల ఆర్‌బికె ఇన్చార్జిలు, ఎంపీఈవోలు, గ్రామ అడ్వైజరీ బోర్డు మెంబర్స్, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

రుద్రవరం : రుద్రవరంలోని ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వర రావు అధ్యక్షతన పిడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫిట్ ఇండియాపై వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాలుగొన్నారు.

9న జాబ్ మేళా : ఎపిఎం

సంజామల : ఈ నెల 9న ఆళ్లగడ్డలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపిఎం బాబు బుధవారం తెలిపారు. అపోలో ఫార్మసీ, అమర్ రాజా గ్రూపులకు చెందిన కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొంటున్నాయనిచెప్పారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన యువతీ యువకులు జాబ్ మేళాలో పాల్గొని వారి దరఖాస్తు అందజేసి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

బనగానపల్లె : నవంబర్ నెల జీతాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు డిసెంబరు ఏడో తేదీ దాటినా ఇంతవరకు జమ కాలేదని, వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మాధవస్వామి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఏపీటిఎఫ్ డివిజన్ కార్యాలయంలో మండల అధ్యక్షులు జె. వెంకట కృష్ణుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిస్థితి ఇలానే ఉంటే ఉద్యోగ ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమానికి వెనకాడబోరని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల అవసరాలు గ్రహించి వెంటనే జీతాలు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షులు మధుసూదన్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు లింగమయ్య, రమేష్, ఎల్ల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

బిసి సదస్సుకు తరలి వెళ్లిన నాయకులు

బనగానపల్లె : బనగానపల్లె నియోజకవర్గం నుండి జయహో బిసి సదస్సుకు వైసిపి బిసి నాయకులు అధిక సంఖ్యలో బుధవారం తరలి వెళ్లారు. శాలివాహన సంఘం నియోజకవర్గ అధ్యక్షులు వైసీపీ బీసీ నాయకులు కుమ్మరి సురేష్ బాబు ఆధ్వర్యంలో నాయకులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. నాయకులు వెంకటసుబ్బయ్య, వినోద్, రామసుబ్బయ్య, శివకృష్ణ, రవి, వెంకటరాముడు, సుబ్బారాయుడు, శివుడు, వీరేంద్ర , సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

కోవెలకుంట్ల : మండలంలోని కలుగొట్ల గ్రామంలో కాశీనాయనా ఆరాధన జ్యోతి ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సందర్శించి మానవత సంస్థ సేవలను అభినందించారు. వైద్య శిబిరంలో వేలాది మంది భక్తులు వైద్య సేవలు వినియోగించుకున్నారు. వైద్య శిబిరంలో వైద్యులు వేంకటేశ్వర రెడ్డి, మునిస్వామి, రేవనూరు పీహెచ్‌సి సిబ్బంది, దాదు రామసుబ్బారెడ్డి, గుద్దేటి వెంకటసుబ్బారెడ్డి, అంబులెన్స్ డ్రైవర్ సుధాకర్ తదితరులు పాల్గొని సేవలందించారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మనం పత్రిక విలేకరిపై కేసు నమోదు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మున్సిపాలిటీ బిఆర్‌ఆర్ నగర్ గుడిసె వాసులపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వార్త రాసిన మనం పత్రిక విలేకరిపై కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, నాయకులు కె.భాస్కర్ రెడ్డి, పి.పకీర్‌సాహెబ్, పి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మనం పత్రిక విలేకరిపై కేసు నమోదు చేయాలని సిఐ విజయభాస్కర్‌కు, తహశీల్దార్ రాజశేఖర్ బాబుకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందికొట్కూరులోని కర్నూల్ రోడ్డులో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ కాలనీలో సర్వే నెంబరు 589, 590, 595లలో 2010 నుండి 150 మంది నిరుపేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారని, వారికి కనీస వసతులు కల్పించాలని సిపిఎంగా చేసిన పోరాటాల ఫలితంగా మున్సిపాలిటీ వారు విద్యుత్ స్తంభాలు, ఇళ్లకు మీటర్లు, మంచినీటి పైపులైను, రోడ్లు వేశారని తెలిపారు. గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని మున్సిపాలిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తీర్మానం చేసి రెవెన్యూ అధికారులకు పంపారన్నారు. అయితే మంగళవారం మనం పత్రికలో విలేకరి చిన్న స్వామి మారన్న 'గుడిసె వేసుకో-పదివేలు పుచ్చుకో' శీర్షికన తప్పుడు వార్త రాసి ప్రజాసంఘాల పరువుకు భంగం కల్పించారని, వెంటనే కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గోపాలకృష్ణ, ఆంజనేయులు, వేణుగోపాల్, బెస్తరాజు, జయరాణి, సోడా బీబీ, నారాయణ, నాగలక్ష్మి, ఎస్.రత్నమ్మ, దుర్గ ప్రసాద్, పకీరయ్య, రాజు, గుడిసెవాసులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి : వ్యకాసం

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో ఈనెల 8, 9, 10వ తేదీలలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు కోరారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మండల కార్యదర్శి పక్కీర్ సాహెబ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుండి 1000 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. 8న వేలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె భాస్కర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు పి వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు జయరాణి, రామిరెడ్డి, వేణుగోపాల్, గోపాలకృష్ణ, సోడా బీబీ, ఆంజనేయులు, చరణ్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం కోరుతూ ఆత్మకూరు మండలంలోని వడ్ల రామాపురం గ్రామంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహ నాయక్ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డి గూడెంలో ఈ నెల 8, 9, 10వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. సభలో రాష్ట్రంలో ఉన్న ప్రజానీకం, వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికుల విద్య, వైద్యం, ఉపాధి ఉద్యోగ అవకాశాలు కోసం చర్చించి వచ్చే మూడు సంవత్సరాల్లో వీటిపై పని చేయాలని తీర్మానం చేస్తారన్నారు. కార్యక్రమంలో వ్యకాసం మండల అధ్యక్షులు స్వాములు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



భారాల వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలి : టిడిపి

ప్రజాశక్తి - డోన్

ప్రజలపై వివిధ రకాల భారాలు మోపుతున్న వైసిపిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని టిడిపి పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు కోరారు. ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా డోన్ పట్టణంలో 18,19వ వార్డులలో చాటకొండ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ సంక్షేమ పాలన అని చెబుతూనే ఎస్‌సి, బిసి, మైనార్టీల కార్పొరేషన్లకు ఇచ్చేరుణాలన్నింటికి రద్దు చేశారని చెప్పారు. నవరత్నాల పేరుచెప్పి ప్రజన నడ్డివిరుస్తున్నారని విమర్శించారు. నిధులు , విధులు, కనీసం కుర్చీ లేని నామినేటెడ్ పదువులు బిసిల కేటాయించి ఊకదంపుడు ప్రసంగాలతో ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. డోన్ పట్టణ టిడిపి తెలుగు యువత ప్రధానకార్యదర్శి కేబుల్ కిరణ్ ,డోన్ పట్టణ కమిటీ సభ్యులు అజీజ్ , టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బిసి సెల్ అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున , నంద్యాల జిల్లా టిడిపి రైతు కమిటీ ఉపాధ్యక్షులు బట్ట సత్యం , నంద్యాల జిల్లా టిడిపి రైతు కమిటీ కార్యదర్శి జలదుర్గం విష్ణు పాల్గొన్నారు. డోన్ నియోజకవర్గ టిడిపి తెలుగుయువత ఉపాధ్యక్షులు బి.సాగర్ , డోన్ పట్టణ టిడిపి బిసి సెల్ ప్రధాన కార్యదర్శి నీలం ప్రభాకర్, గంధం చరణ్, కేబుల్ మురళీ, సతీష్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

చనుగొండ్ల గ్రామంలో : మండలంలోని చనుగొండ్ల గ్రామంలో టిడిపి డోన్ మండల అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో సామాన్య ప్రజల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దేవరబండ వెంకటనారాయణ గౌడ్, టిడిపి నాయకులు అబిరెడ్డిపల్లె గోవిందు, ఎద్దుపెంట ఈశ్వరయ్య, మిద్దపల్లె గోవిందు, మధుసూదన్ రెడ్డి, రామాంజనేయులు, జయన్న, కోనేటి కాశీ విశ్వనాథ్, బిసి పెద్దయ్య, దానవీర, మాధవయ్య, సీసంగుంతల బబ్లూ యాదవ్, ఎద్దుపెంట రాజు, మిద్దపల్లి సుధాకర్, తాడూరు వీరంజి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు చాటకొండ శ్రీనివాసులు

కోవెలకుంటలో జిల్లా కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

కోవెలకుంట్ల పట్టణంలో నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ బుధవారం పర్యటించారు. మొదట తహశీల్దార్ కార్యాలయం సందర్శించారు. కోర్టు వెనకవైపు జగనన్న కాలనీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కాలనీలలో పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పట్టణంలోని ఉర్దూ స్కూల్‌లో 8వ తరగతి గదిలో విద్యార్థులకు గణితాన్ని బోధించారు. విద్యార్థుల స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్‌ను తనిఖీ చేశారు. నాడు-నేడు కింద జరుగుతున్న పనులను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తాసిల్దార్ పుష్ప కుమారి, ఎంపిడిఓ మహబూబ్ దౌల, వీఆర్వోలు, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు గణితం బోధిస్తున్న జిల్లా కలెక్టర్

సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకెళ్లాలి

- ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - రుద్రవరం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ ప్రభుత్వ చీఫ్ వీప్ గంగుల ప్రభాకరరెడ్డి తెలిపారు. బుధవారం రుద్రవరంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను సమావేశంలో చదివి వినిపించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మండలంలోని కోటకొండ గ్రామానికి కొత్తగా రూ 12 కోట్ల నిధులతో విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరు అయిందన్నారు. మండలంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో రూ 7.81 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. మండలంలో 60 అంగన్వాడి సెంటర్లు ఉండగా ఏడు సెంటర్లు ప్రభుత్వ నిధులతో నిర్మాణాలు చేపడుతుండగా మిగతావి అద్దె భవనాలలో కొనసాగుతూ ఉన్నాయన్నారు. 2024లోపు పొలాల రీ సర్వే పూర్తవుతుందన్నారు. ఇప్పటికే 80 శాతం పూర్తయింది అన్నారు. కార్యక్రమంలో పుట్టాలమ్మ క్షేత్రం చైర్మన్ గంగుల మనోహర్ రెడ్డి, ఎంపీడీవో మధుసూదన రెడ్డి, జడ్పిటిసి మాధవి, ఎంపీపీ మబ్బు బాలస్వామి, పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి 15వ ఆర్థిక సంఘం రూ 10 లక్షల నిధులతో నిర్మించిన మండల పరిషత్ కార్యాలయం చుట్టూ సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించి ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి పాలనలో కుల, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు బుధవారం మండలంలోని పాతపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో ఎక్కడికి వెళ్లినా ప్రజల నుంచి అనుహస్పందన లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు సన్నల జనార్ధన్ రెడ్డి, ఎంపీటీసీ బెడదల రామేశ్వర రెడ్డి, నాయకులు గడ్డం వెంకటేశ్వర రెడ్డి, బెడదల శ్రీనివాసరెడ్డి, బెడదల శివశంకర్ రెడ్డి, గడ్డం వెంకటరామిరెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, గడ్డం జగదీశ్వర్ రెడ్డి, బెడదల రామచంద్రారెడ్డి, కుమ్మరి మహేష్, బెడదల నారాయణరెడ్డి, దొనపాటి వెంకటేశ్వర్లు, జోలాపురం తిరుపాల్, పల్లె తిరుపతయ్య, బెడదల సత్యం రెడ్డి, మూల రంగస్వామి, మూల చిన్న స్వామి, పూజారి సుబ్బరాయుడు, హెూటల్ సుబ్బారెడ్డి, ఈడిగ గోపాల్, బోయ మహేష్, మాదిగ ఈశ్వరయ్య, నక్క బాలన్న, బాబు, మండల అభివృద్ధి అధికారి శివ రామయ్య, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **డోన్ :** ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం అని టౌన్ యూత్ ప్రెసిడెంట్ టి.ఇ.దినేష్ గౌడ్ అన్నారు. డోన్ పట్టణంలోని మూడో వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మూడో వార్డు కౌన్సిలర్ చలం వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సందర్భంగా టౌన్ యూత్ ప్రెసిడెంట్ టి.ఇ.దినేష్ గౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, కౌన్సిలర్లు, బద్దల సుబ్బలక్ష్మి, శివలక్ష్మి, బోయ కళావతి, సుంకయ్య, వైసిపి నాయకులు పోస్ట్ ప్రసాద్, అశోక్, చలం వంశీ, కుళ్లాయప్ప, డంకేశ్వరరావు, దస్తగిరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్లెట్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

జయజ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీకి

రైల్వే లైన్ భూముల సర్వేను అడ్డుకున్న రైతులు

- హైకోర్టు నోటీసులు చూపించడంతో సర్వే వాయిదా

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని యనకండ్ల గ్రామంలోని జయ జ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వేలైన్ కోసం భూములు సర్వే చేసేందుకు బుధవారం డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. రైతులు తమ భూములను జయ జ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ రైల్వే లైన్ కోసం ఇవ్వమని చెప్పారు. తమ భూమిలో పంటలు ఉండగా ఎలా సర్వే చేస్తారని రైతులు అధికారులను అడ్డుకున్నారు. కొందరు రైతులు హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. న్యాయవాది యూసుఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో 10 మంది రైతులు హైకోర్టు కాపీలను ఆర్డిఓ వెంకటరెడ్డికి ఇచ్చారు. దీంతో భూ సర్వేను వాయిదా వేస్తున్నట్లు ఆర్డిఓ తెలిపారు. ఆర్డీవో మాట్లాడుతూ హైకోర్టు భూ సర్వే నిలిపివేయాలని స్టే ఇవ్వలేదని, నిబంధనల ప్రకారం సర్వే చేయాలని మాత్రమే నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. రైతులు తమ పొలంలో పంటలు ఉన్నాయని సర్వే చేయవద్దని కోరడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. రైతులు కోర్టు నుండి సర్వే చేయవద్దని ఆర్డర్ తెచ్చుకుంటే సర్వే చేయమని తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ రామకృష్ణ, సర్వే అధికారులు, సీఐ సుబ్బరాయుడు, ఎస్సైలు శంకర్ నాయక్, రామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ చేయరాదు : రైతులు

జయ జ్యోతి సిమెంట్ ఫ్యాక్టరీ ప్రైవేట్ కంపెనీకి అధికారులు బలవంతంగా భూసేకరణ చేయరాదని రైతులు సాంబశివారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామసుబ్బయ్య, నాగేంద్ర, సుభద్రలు అధికారులను కోరారు. బోర్ల కింద రెండు పంటలు పండే నల్ల రేగడి భూములను సిమెంట్ ఫ్యాక్టరీకి ఇవ్వమని రైతులు తెలిపారు. తమకు ఈ భూమి కోల్పోతే జీవనోపాధి లేదని తెలిపారు. భూమిలో అడ్డంగా రైల్వేలైన్ పోతే అటు ఇటువైపు భూమి మిగులుతుందని, తాము ఆ భూమిలో సాగు చేసుకోవడం కష్టమని తెలిపారు. తాము రైల్వే లైన్ కోసం భూమిని ఇవ్వమని రైతులు అధికారులకు విన్నవించారు. ప్రయివేట్ కంపెనీ ఆదాయం కోసం ప్రభుత్వ అధికారులు తమపై ఒత్తిడి తెచ్చి భూసేకరణ చేయాలనుకోవడం సమంజసం కాదని తెలిపారు. భూసేకరణను రద్దు చేయాలని రైతులు కోరారు.

అధికారులతో మాట్లాడుతున్న రైతులు



ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను కొనసాగించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను కొనసాగించాలని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం డిమాండ్ చేశారు. బుధవారం సున్నిపెంటలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 2,40,000 మందిని ఒక్క కలం పోటుతో తొలగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. మరోవైపు విద్యాశాఖ మంత్రి కొన్ని విభాగాలలో తొలగింపు ప్రక్రియ కొనసాగుతుందని పొంతలు లేని ప్రకటనలు చేస్తున్నారన్నారు. ఈ నెల 3న ఆర్థిక శాఖ అనుమతితో నియమితులైన ఆప్కాస్‌లోని 12 మంది ఉద్యోగులను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అలాగే శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు గత ఏడు నెలల నుండి వేతనాలు రాకపోవడంతో ఉన్నతాధికారులను అడగుగా నిధులు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను కొనసాగించాలని డిమాండ్ చేశారు.



విధుల పట్ల అలసత్వం వహించరాదు : ఐఒఆర్‌డి

ప్రజాశక్తి - పాములపాడు

సచివాలయ సిబ్బంది విధుల పట్ల అరసత్వం వహించరాదని ఇఒఆర్‌డి సుమిత్రమ్మ అన్నారు. బుధవారం మండలంలోని భానుముక్కల గ్రామ సచివాలయాన్ని ఆమె పరిశీలించారు. చెత్త నుండి సంపద తయారు కేంద్రాన్ని పరిశీలించి, గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు తడి, పొడి చెత్త వేరుగా చేసి ఎరువులు తయారు చేయాలన్నారు. ప్రతిరోజు గ్రామంలో ఉన్న చెత్తను తప్పనిసరిగా సేకరించాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్నం చిన్నపిల్లలకు పెట్టే భోజనాన్ని, రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన : టిడిపి

ప్రజాశక్తి- ప్యాపిలి

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని టిడిపి డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్యాపిలిలో టిడిపి ఆధ్వర్యంలో ఇదే కర్మక రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన డోన్ నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆర్‌ఈ.రాఘవేంద్రలు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో ఉద్యోగ అవకాశాలు లేక యువత వేరే రాష్ట్రాలకు పోవాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో మన రాష్ట్రానికి ఎన్నో కంపెనీలు వచ్చాయని, కానీ ఈ వైసిపి ప్రభుత్వంలో ఉన్న కంపెనీలు వేరే రాష్ట్రాలకు తరలి పోతున్నాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా మళ్లీ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీని గెలిపించుకోలేకపోతే రాష్ట్రం అస్తవ్యస్తం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో రామసుబ్బయ్య, రాంమోహన్ యాదవ్, వేంకటేశ్వరరెడ్డి, సుంకయ్య, నాగేంద్ర, అభిలాష్ రెడ్డి, మౌలాలి రెడ్డి, దనంమధు, మల్లి కార్జున, రామాంజినేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు. **బేతంచర్ల :** పట్టణంలో అభివృద్ధి అంటే బాగున్న రోడ్లను నడవడానికి వీలు కాకుండా చేయడమేనా అని టిడిపి పట్టణ కార్యదర్శి కాకర్ల షేక్షావలి చౌదరి అన్నారు. బేతంచర్లలోని 17వ వార్డులో టిడిపి నాయకులు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. బుగ్గాన పల్లి రమేష్, కౌన్సిలర్ రామ్మూర్తి శ్రీనివాస గౌడ్, రామవరం శివ భీమా రెడ్డి, నాయకులు మేకల నాగరాజు, నంద్యాల మధు, కానాల ఆంజనేయులు, బర్రె గొడ్ల రమేష్ రెడ్డి, మలిపెద్ది నాగేశ్వర్, తిమ్మరాజు, సెటిల్మెంట్ శెట్టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



ఇదేమీ కర్మ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మాధవీలత

బాల అకాడమీలో నేషనల్ లెటర్ రైటింగ్ డే

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణంలోని బాల అకాడమీ పాఠశాలలో బుధవారం నేషనల్ లెటర్ రైటింగ్ డే, భారతదేశ జెండా దినోత్సవం, అంతర్జాతీయ పౌర విమాన దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎంజివి.రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్ రాకముందు ఉత్తరాలు రాసేవారని తెలిపారు. అలాగే దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలను బాధ్యతలను తెలియజేసేలా భారతదేశ పతాక దినోత్సవం ఈరోజు జరుపుకుంటున్నామని, అంతర్జాతీయ పౌర విమానాయాన దినోత్సవం కూడా ఇదే రోజు అని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిసాయుధ దళాల సేవలు ప్రశంసనీయం : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

త్రిసాయుధ దళాల సేవలు ప్రశంసనీయమని జిల్లా కలెక్టరు మనజిర్ జిలానీ సామూన్ పేర్కొన్నారు. త్రిసాయుధ దళాల పతాక దినోత్సవంను పురస్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టరు తమ వంతు విరాళం ఇచ్చి కార్యాక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ దేశ సేవలో వీర జవానుల సేవలు మరువలేనివన్నారు. మాజీ సైనికుల సంక్షేమార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక నిధికి విరాళాలు అందిస్తున్న ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వీరమరణం పొందిన కుటుంబాల వారికి సైనిక సంక్షేమ వారి పోస్టర్‌ను అందించారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యలయపు సిబ్బంది రఫిక్ ఆహామద్, సీనియర్ అసిస్టెంట్ కామరిన్, వెల్ఫేర్ అర్గనైజర్, పర్వీన్ బాను, మాజీ సైనికులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు పేరుతో దోపిడీ : పిడిఎస్‌యు

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

నంద్యాల జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు పదవ తరగతి పరీక్ష ఫీజు 125 రూపాయలు ఉండగా తల్లిదండ్రుల నుంచి 1000 నుండి 1500 రూపాయలు వసూలు చేస్తున్నారని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ పేర్కొన్నారు. అధికంగా వసూలు చేస్తున్న ప్రయివేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో డిఇఒ అనురాధకి బుధవారం వినతి పత్రం అందజేశారు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు దస్తగిరి, నవీన్, ఉపాధ్యక్షులు అజిత్, నాని, శ్యామ్, అనిల్, హరి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉపాధి కూలీకి పని చూపాలి : డ్వామా పిడి

ప్రజాశక్తి - ఆత్మకూరు

ప్రతి ఉపాధి కూలీకి పని చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నంద్యాల జిల్లా డ్వామా పిడి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల మండలాల ఉపాధి ఏపీఓలు, ఎంపిడిఒలు, ఎన్‌ఆర్ఇజిఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మండలాల వారిగా చేసిన పనుల వివరాలు, కూలీల హాజరు శాతం, భవిష్యత్తులో వారికి ఎలా పనులు కల్పించాలి అనే విషయంపై చర్చించారు. సమావేశంలో ఆయా మండలాల ఎంపిడిఒలు మోహన్ కుమార్, దాసరి మేరీ, నాగ శివలీల, మనిమంజరి, శోభారాణి, పివి రమణ, ఏపీవోలు నాగమ్మ, మల్లికార్జున, విమలమ్మ, గౌరీ బాయ్, అలివేలు మంగ తదితరులు పాల్గొన్నారు.